ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 11, 2009

43699

బతుకు వెత...
బంగారు నేత...

హ్యాపీబర్త్‌డే

(2009 అక్టోబర్ 11 నుంచి 2009 అక్టోబర్ 17 వరకు)

ఇ.ధనుష్
అక్టోబర్-13
కోటేశ్వరి-కృష్ణ
గాయంవారిపల్లి-ప్రకాశం

ఎస్. అచ్యుత్‌కుమార్
1 సం॥, అక్టోబర్-11
లత-లక్ష్మీకనకయ్య
నంగునూరు-మెదక్

యం.పూజ
2సం॥, అక్టోబర్-10
సంతోష-యాదయ్య
సీతారాంపేట-రంగారెడ్డి

జె. వెంకట సుశాంత్‌బాబు
1 సం॥, అక్టోబర్-2008
లావణ్య-రవీంద్రబాబు
సుళ్లూరుపేట-నెల్లూరు

కె. ఐశ్వర్యగౌడ్
8 సం॥, అక్టోబర్-11
సునీత-మహేందర్‌గౌడ్
నంగునూరు-మెదక్

ఎస్.రాఘవేంద్ర
9 సం॥, అక్టోబర్-16
అనసూయ-రవిప్రకాష్
నంద్యాల-కర్నూలు

ఎ.ప్రవల్లిక
1 సం॥, అక్టోబర్-14
ఉషాకిరణ్-ఫణిగోపాల్
సైదాబాద్-హైదరాబాద్

యం. రాజ్‌శేఖర్‌నాయక్
అక్టోబర్
మాణిక్యమ్మ-రాములు
గార్ల-ఖమ్మం

ఎస్. అనూష
4 సం॥, అక్టోబర్-2005
లక్ష్మమ్మ-రామస్వామి
మాధవానిపల్లి-మ॥నగర్

మహబూబ్ షేక్
2 సం॥, అక్టోబర్-2007
మోహ్సన్‌షేక్-మహ్మద్‌షేక్
కిషన్‌బాగ్-హైదరాబాద్

ఎస్. లక్ష్మీశ్రీసాయిప్రవీణ్
అక్టోబర్
రమాదేవి-లక్ష్మీరాజేష్
గుండుగొలను-ప॥గో॥

మనలో మాట

వరద పాఠాలు

చెంపదెబ్బ గోడదెబ్బ స్ఫురణకొచ్చేది ఇలాంటప్పుడే! ఒకపక్క కరువు.. ఇంకోపక్క వరద. ఏకకాలంలో రెండు వైపరీత్యాలను ఎదుర్కోవాల్సి రావడం ఓ దారుణమైన దుస్థితి! అప్పటిదాకా తాగునీటికి కటకట.. అంతలోనే పీకలదాకా నీటితో ప్రాణసంకటం.. ఇదో విచిత్రమైన విపత్కర పరిస్థితి! కరువైనా, వరదైనా ఊరకనే రావు, ఉత్తినే పోవు. వచ్చేముందు హెచ్చరిస్తాయి. పోతూ పోతూ పాఠం చెబుతాయి. గ్రహించి మసలుకోవడం మన వంతు మరి! మన పాలకులకు గుణపాఠాలు ఒక్కపట్టాన ఒంటపట్టవు. దానికి మూల్యం జనం చెల్లించుకోవాల్సి వస్తోంది. వరద పాఠాలను ఒకసారి మననం చేసుకుందాం.

◆ కరువుకైనా, వరదకైనా బలహీనులే గురి! ఉపాధి దొరకని జనాన్ని కరువు ఎక్కడెక్కడికో తరిమికొడితే- వరద వాళ్ళిళ్లనే ఈజీగా కొల్లగొడుతుంది. మట్టిళ్లను, పూరిళ్లను కూల్చడం, ఆ ఇళ్లలోని పెట్టేబేడా ఎత్తుకుపోవడం వరదకు సరదా కాబోలు!

◆ కరువూ, వరదా ఏకకాలంలో వస్తే కేంద్ర పరిశీలక బృందాలు గొప్ప బీజ గణిత పాండిత్యాన్ని, తర్కశాస్త్ర ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తాయి. 'రెండు కత్తులు ఒక ఒరలో ఇమడనట్టే- కరువూ వరదా ఒకేసారి సాధ్యం కావు. వరద ఉంటే కరువు లేనట్టు! కరువు ఉంటే వరద రానట్టు.. రెండూ లేవనుకుంటే జనానికి సహాయం అవసరం లేనట్టు! ఒకవేళ రెండూ ఉన్నాయనుకుంటే ఒకదానికొకటి చెల్లు. అప్పుడూ సహాయం అవసరం నిల్లు' అని ముక్తాయింపు పలకవచ్చు.

◆ స్వాములైనా, ఆసాములైనా ఆపద వచ్చినప్పుడే అసలు రంగు బయటపడుతుంది. సర్వ కార్యాకార్యాలకు సర్వేశ్వరుడే కారకుడని, సర్వులకూ అతడే రక్షకుడని స్వాములోర్లు నిత్యం ప్రబోధిస్తారు. మొన్నటి వరద మంత్రాలయాన్ని ముంచెత్తినప్పుడు అందరికన్నా ముందు పునరావాసం పొందింది మాత్రం అక్కడి మఠం స్వామీజీయే! మంత్రాలయంలోకి వరదనీరు వస్తుంటే- ఆయన ప్రత్యేక హెలీకాప్టర్లో కర్నాటకకు తరలిపోయారు. 'వరద మిథ్య పలాయనం మిథ్య' అని భక్తులు నమ్మాలి కాబోలు!

◆ వరదవంటి వైపరీత్యాలవల్ల కూడా కొందరికి కొన్ని మేళ్లు జరుగుతాయి. బహుశా అధికార పార్టీ అధిష్టానానికి ఈ వరద ఓ వర ప్రదాయిని అన్న ఫీలింగు కలిగి ఉండొచ్చు. ఎందుకంటే- మొన్నటిదాకా దాని పరిస్థితి *కంటిలోన నలుసు, కాలిముల్లు, ఇంటిలోన పోరు ఇంతింత కాదయా* అన్నట్టు ఉండేది. ముఖ్యమంత్రి కుర్చీ గురించి బయటికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీని సందిగ్ధం... నినాదాలూ నిరసనలూ ఏ కుంపటిని రాజేస్తాయోనన్న భయం... వరదల జోరు ఆ వేడివాడి వాతావరణాన్ని చల్లార్చింది. సందట్లో సడేమియా అన్నట్టు నూతన ముఖ్యమంత్రి సీ బ్లాకు సీటులోకి మారిపోయారు. ఈ పరిణామంతో లోలోన సంతోషించే హస్తవాసులు సైతం ప్రస్తుతానికి వరుణుడు తమవాడని చెప్పుకోలేరు. ఎందుకంటే ఎంత వరుణుడైనా వర్షం వేళ తమవాడు కానీ వరద వేళ కాదు కదా! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
రుచి	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
ఆరోగ్యం	...	18
క్రైమ్ కథ	...	19
కథ	...	20
చూద్దామా	...	22

ఇంకా...

స్ఫూర్తి ... 4

నిరంతరం వెంటాడిన 'నికృష్ట' జీవుల చరిత్ర

చిరునవ్వుల దీపావళికి చిరుజాగ్రత్తలు 8



తెలుసుకుందామా... 24

అందరికి అందని ఆహారం



సముచితం

సెప్టెంబర్ 27ఆదివారం సంచికలో మనలోమాట 'దసరా పాట' పాత రోజులను గుర్తు చేసింది. నాటి వేడుకలు, పిల్లలచే బాణాలు చేతపట్టించి జరిపే తతంగం ఏనాడో పోయింది. ఆ దసరా పాటలు కూడాలేవు. ఏదయా మీదయా మామీదలేదు.. అయ్యవారికి చాలు అయిదు వరహాలు - పిల్లవానికి చాలు పప్పుబెల్లాలు వంటి పాటలు అప్పట్లో ఇంటింటా మారుమోగేవి. నేడు అవి విందామన్నా కానేరావు. ఎక్కడో కొన్ని ఇళ్లలో బొమ్మల కొలువులు కనిపిస్తాయి. నేటి సామాన్య దుర్భర జీవితానికి తగినట్లు ఏలికల ముందు 'ఏదయా మీదయా మామీదలేదు.. ధరలు ఇంతలా పెంచుట ఇది మీకు తగదు' సముచితంగా వుంది.

నూతి నారాయణరావు,
గద్దిఅన్నారం.

మూర్ 'ప్రేమకథ' బాగుంది

సెప్టెంబర్ చివరి సంచికలో అట్టమీది కథ 'కాపిటలిజమ్.. ఓ ప్రేమకథ' చదివిన తర్వాత చాలా విషయాలు తెల్సుకున్నాం. హాలివుడ్‌కు చెందిన మైకేల్ మూర్ అమెరికాలో తనదైన శైలిలో ముందుకెళ్తూ మతబోధకుడుగానే కాకుండా తన ముందు అన్యాయం జరిగితే తక్షణమే స్పందించే నాయకుడిగా వెలుగొందుతున్నాడు. బాల్యంలో సమాజ చైతన్య కార్యక్రమాల్లో పాలు పంచుకోవడమే గాక 1989వ సంవత్సరంలో డాక్యుమెంటరీ చేయాలన్న ఆలోచన రావడం అభినందనీయం. నిజ జీవితంలో ఎన్నో ఆటంకాలను అధిగమించి మొక్కవోని ధైర్యంతో అమెరికాలో పలు డాక్యుమెంటరీలు రూపొందించిన ఘనత కేవలం మూర్‌కే దక్కుతుంది. ఆరోగ్యం పేజీలో 'గుండె జబ్బులు - చికిత్సా పద్ధతులు' చదివిన తర్వాత ఆంజియో ప్లాస్టీ, స్టంటింగ్ అంటే ఏమిటో అర్థమైంది. ఇంద్రకీలాద్రి దేవీ నవరాత్రి ఉత్సవాలు చదివిన తర్వాత వివిధ రకాలైన అలంకారాలతో వెలుగొందుతున్న అమ్మవారి పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకున్నాము.

కామిడి సతీష్ రెడ్డి, పరకాల.

ఉపకరిస్తున్న 'ఆరోగ్యం'

సెప్టెంబర్ నెల ఆఖరి సంచిక అట్టమీది కథగా... 'కాపిటలిజమ్... ఆసక్తికరంగా వుంది. 'ఆరోగ్యం'లో గుండె జబ్బుల విషయంలో గైకొనాల్సిన జాగ్రత్తలు అవగాహన కలిగించాయి. 'బాలనేస్తాలు'లో పూర్తిచేస్తేపోలా.. కొత్త ప్రక్రియగా ఆకట్టుకుంది. ప్రపంచ పొడగరి 'సుల్తాన్ కోసెవ్' ను చూస్తే వారెవ్వా.. అనుకోక తప్పింది కాదు. అతని ఆకారానికి తగ్గ సరంజామాను ఏర్పరచుకోవాల్సి రావడం గమనార్హం. సత్తారు భాస్కరరావు గారందించిన విశేషాలతో 'దూసి బెనర్జీ' వంటి వారు శ్రీకాకుళం జిల్లాకే తలమానికంగా నిలిచారు. కథలలో రారాజు, కాళీపట్నం రామారావు మాష్టారైతే హరికథా కాళిదాసుగా దూసి బెనర్జీ గారి ఎనర్జీనే పేర్కొనక తప్పదు. ఇసుక శబ్దం చేయడం... ఏకంగా రాళ్ళ తినే ఏనుగులు... అసాధారణ ఎత్తులో ఎగిరే పాము... కోట పదిలమే కానీ గదులే లేవు! వంటి చిత్ర విచిత్ర వార్తల సమాహారం 'తెల్సా' అంటే అందరికీ ఇష్టమే తెల్సా! దసరా పాట మనసులో మాట గా దయతో అడిగారా? నిర్దయతో బెదిరించారా? ఏదైనా తప్పదుగా!!

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

క.ప్ర తప్పనిసరిగా చదవాలి

గతితార్కిక నియమాలను మానవ సమాజానికి పరిణామానికి అన్వయించిన మార్క్స్ ఏంగిల్స్‌ల రచన కమ్యూనిస్టు ప్రణాళిక. ఇదొక శాస్త్రీయ పరిశీలన కలిగినది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఎన్నైనా వుండొచ్చు. కానీ అందరూ అంగీకరించి ఆచరిస్తామని ప్రకటించింది ఈ ప్రణాళికనే. అన్వయించి ప్రణాళికలోనికి తీసుకెళ్లడంలో భిన్న ధృవాలు, వైఫల్యాలు కొనసాగుతూనే వున్నాయి. పార్టీ సభ్యులు ప్రతివారు ప్రణాళిక తప్పనిసరిగా చదివి తీరాలి. కమ్యూనిస్టు జీవితం అంటే ఉన్నతంగా ఆలోచించాలి. సమాన్యంగా జీవించాలి. కార్యదీక్ష పట్టుదల, త్యాగం వుండాలి. తమ్మినేని వీరభద్రంగారు కమ్యూనిస్టు ప్రణాళిక నుంచి తను పొందిన స్ఫూర్తిని ఉదాహరణలతో సహా చెప్పినందుకు ధన్యవాదాలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

విలువలు తెలుసుకుంటున్నాం

మేము చదివిన పుస్తకాల గురించి స్ఫూర్తిలో ప్రచురిస్తున్నారు. అయితే మేము వాటిని చదివిన



వారం మాత్రమే. కానీ స్ఫూర్తిలో వివరించే వారు తమ పోరాట అనుభవాలు కలిపి రాస్తున్నవి చదివినపుడు విషయ విలువలు తెలుసుకుంటున్నాను. నేను ప్రజా పోరాటాల్లో పాల్గొనలేక పోతున్నందుకు బాధపడుతున్నాను.బెనర్జీగారు వేలాది హరికథలు తెలుగులో చెప్పి, తెలుగు వారికి పురాణ బోధన చేశారు. అదే విధంగా వందల సార్లు ఆంగ్లంలో హరికథలు చెప్పి, ఇంగ్లీషు మీడియంలో చదివిన వారికి పురాణ బోధన చేశారు. ఆ విధంగా పామర పండితులకు దగ్గరైనారు. కేపిటలిజమ్ సినిమా తీసిన మైఖేల్ మూర్ గురించి చదివినపుడు మరో చార్లీ చాప్లిన్ కపిపించారు. వీరు చరిత్రలో నిలిచిపోయేవారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేదైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

కవిత్వం

నువ్వు మారు!

- రాధిక

మేఘాల్ని మథిస్తే వచ్చేది
కన్నీళ్ళు
మనకు ఎన్నాళ్ళు?
అన్నం పెట్టే వాడన్నాం
దేశానికి వెన్నెముక అన్నాం
ఎముకలిరిచీ,
కూటి గిన్నెలిసిరేసీ,
అన్నపూర్ణని చెరబడుతున్నాం
ఎవరెవరో అందలాలెక్కుతున్నారు
పనికి మాలిన వాళ్ల ఖద్దరు కడుతున్నారు
పశు ప్రవృత్తి కల్లోడు కార్లల్లో తిరుగుతున్నాడు
మోసకారోడు మంది పైసలకు
ఫైనాన్సు ఎగ్గొడుతున్నాడు.
చదువుల పేరుతోని చట్టబద్ధ వ్యాపారం చేస్తున్నారు
అందగత్తెల పోటీలతో అంగడి బొమ్మల్ని చేస్తున్నారు
ఆంధ్రదేశంలో,
మొత్తానికి, ఆడదానికి రక్షణ లేదు
అన్నం పెట్టే రైతన్నకు భూమి లేదు
సహకారం పేరుతో
కండ్లల్లో కారం కొట్టే ఉపాయం చేస్తున్నది
సర్కారు
జనాలకు ఏ నౌకారీ లేకున్నా...
పోలీస్ నౌకర్లను ఖరారు చేస్తున్నారు
రైతులు తిరగబడకండి!!!
ఒక్క ఓటు ఆయుధం మీ చేతులు వుంచుకొని
దిక్కులు చూస్తున్నారు
దుక్కులు ఎండిపోయి
అప్పులు పెరిగిపోయి
పుస్తెలు తాకట్టుబడి
బుక్కెడు బువ్వకోసం
ఎక్కే బ్యాంకు దిగే బ్యాంకు
అవమానాల్ని - చీదరింపుల్ని
తలపాగాలా చుట్టుకుని
ఎవడి తలపుండ్లు కడుగుదామని!?
నీ ఏడుపుకు ఆకాశం కురవట్లేదు,
నీ మాటలకు మబ్బులు గర్జించట్లేదు,
నీ చూపులకు కార్చిచ్చు పుట్టట్లేదు,
నిన్నుణగ దొక్కే వ్యవస్థ బూదిద కుప్పలో
మళ్ళీ మళ్ళీ పుట్టే ఫనిక్స్ వైతున్నావే తప్ప!!
నీ తలరాతను మార్చే ఓటును
ఆయుధం చేసుకోవడం లేదు.
రైతన్నా !! ఇకనైనా
నువ్వు మారు
ఈ ఒక్కమారు!

దీపావళి

- సోమిశెట్టి వేణుగోపాల్



చీకటిని శిల్పంగా చెక్కిన
దీపాల ఉలి ఈ దీపావళి
సత్యభామ శౌర్యానికి
స్త్రీ శక్తి కీర్తికి ఇది పుట్టినరోజు
నరకాసుర దౌర్జన్యానికి
చెడు కీడులకు ఇది చరమరాత్రి
కలిమిలేముల తేడాలను
కాలరాసే వెలుగు వేడుగ
సకుటుంబ సపరివారము
కార్తీక దీపాలతో
సంతోషలక్ష్మిని స్వాగతించే
పర్వదినము ఇది
మూడు పువ్వులు ఆరుకాయలను
కోరుకునే వ్యాపారనోములకు ఇది
నిలయ దానము
కాకర వత్తుల
కరకర మిరుగులన్నీ
చిన్న పిల్లల కేరింతలై
నేలరాలతాయి
జువ్వుమంటూ ఎగసే
తారాజువ్వలు
సర్వజనుల సంబరాల్ని
అంబరాన్ని తాకిస్తాయి
బాణాసంచాల బడబడ శబ్దాలన్నీ
ఆనందపు అరుపుల
ప్రతిధ్వనులై ప్రజ్వలిస్తాయి.

★

స్ఫూర్తి



-నిఖిలేశ్వర్,
ప్రముఖ కవి, రచయిత



నిరంతరం వెంటాడిన 'నికృష్ట' జీవుల చరిత్ర

"**భూ**మ్మీది నికృష్ట జీవులు" (The Wretched of The Earth) అనే శీర్షికతో ఆ గ్రంథాన్ని చూడగానే నాకు ఆశ్చర్యం వేసింది. ఆ జీవులు ఎవరై వుంటారని చదవడం ప్రారంభించాను. నాగరికత వ్యాపించిన తర్వాత కూడా ఈ భూగోళంపై కొంత కాలం పాటు నికృష్టులుగా మారిపోయిన ప్రజల గురించి ఆ గ్రంథ రచయిత ఫ్రాంజ్‌ఫానన్ (Frantz Fanon) విశ్లేషించి వివరించాడని తెలుసుకున్నాను. ముఖ్యంగా 18 – 20వ శతాబ్దాల మధ్య కాలంలో ఆసియా – ఆఫ్రికా ఖండవాసులు, ఐరోపా పాలకుల చేతుల్లో వలసదేశ ప్రజలుగా ఎలా కృంగి పోయారో విడమర్చి చెప్పాడు రచయిత. మార్క్సిస్టు చింతనాపరులకు ఫానన్ తన సాంస్కృతిక విశ్లేషణతో, మనస్తత్వ పరిశోధనల ఆధారంగా కొత్త వెలుగును ప్రసరింపచేశాడు.

1969లో మొదటిసారి నేను ఈ "ది రెచెడ్ ఆఫ్ ద ఎర్త్" గ్రంథాన్ని సీనియర్ సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ గారి దగ్గర చూశాను. అప్పటికే "దిగంబర కవులు"గా మూడు సంపుటాలు వెలువరించిన దశ. మా రెండో సంపుటం పీఠికలో "ఈ భూమ్మీద ఆకలి వున్నంత వరకు మార్క్సిజాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీ లేదు" అని దృఢంగా నమ్మిన దశలోనే ఈ గ్రంథం నా చేతిలోకి వచ్చింది.

మిత్రులు ప్రసాద్‌గారి దగ్గర ఆ పుస్తకం తీసుకుని, దాదాపు వారం పదిరోజుల దాకా చదివాను. ఆ గ్రంథంలోంచి విస్తృతంగా నోట్సు రాసుకున్నాను. నన్ను విపరీతంగా ఆలోచింపచేసి ఆకట్టుకున్న ఫానన్, మౌలికంగా కొన్ని ముఖ్యమైన సామాజికాంశాలను చెప్పాడనిపించింది. యూరప్‌కు వలస దేశాలుగా ఊడిగం చేసిన దేశాలలో మరీ ముఖ్యంగా బ్రిటన్(ఇంగ్లాండ్)కు బానిస దేశంగా మారిపోయిన భారతదేశంలో అన్ని విధాలుగా చిక్కిశల్యమైన చారిత్రక దురవస్థ గుర్తుకొచ్చింది.

గతితార్కిక భౌతికవాద కొలమానాలతో ప్రపంచ చరిత్రను అర్థం చేసుకునే క్రమంలో ఈ గ్రంథం నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. తర్వాత అనేక దశల్లో నా రచనా క్రమానికి ఇది పరోక్షంగా దోహదపడింది. మన సాహిత్యాన్ని, సంస్కృతిని హేతుబద్ధంగా విశ్లేషించుకోవడానికి, నిజానిజాలు తెల్సుకోవడానికి ఇది ఒక చారిత్రక అధ్యయనంగా కూడా నాకు సహాయపడింది. ఈ పుస్తకం చదివిన తర్వాత ఈ అంశాలు నన్ను నిరంతరం వెంటాడుతూ వచ్చాయి. కాబట్టి ఒక మౌలికమైన చింతనకు మూడో ప్రపంచ దేశాల్లో వుండే మేధావుల రచనలు ఈ విధంగా స్ఫూర్తినిస్తాయని అర్థంచేసుకున్నాను. అంతేకాదు! రచయితలు అంతర్జాతీయ రాజకీయాన్ని అర్థంచేసుకోవడానికి, వలసాధిపత్యంలో మగ్గిపోయినవాళ్ల ఆ బానిస మానసికత నుంచి బయటపడడానికి ఇలాంటి గ్రంథాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి. అట్లాగే ఒక దేశ సంస్కృతిని అర్థం చేసుకొని దాని మూలాన్ని అన్వేషించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. స్వతంత్ర ఆలోచనా విధానాన్ని అలవరచుకోడానికి దోహదపడుతుంది.

"ది రెచెడ్ ఆఫ్ ద ఎర్త్" రచయిత స్వయంగా సైకియాట్రిస్టు. ఆయనే ఫ్రాంజ్‌ఫానన్. ఆఫ్రికన్ నల్లజాతి మూలాలతో అల్జీరియా దేశంలో పుట్టి పెరిగి, మానసిక వైద్యుడిగా ఆల్జీరియన్ ప్రజా ఉద్యమాలతో మమేకమైనవాడు. ఫ్రాన్స్‌కు వలస దేశంగా మగ్గిపోయిన అల్జీరియా దేశ ప్రజల భాషకూడా ఫ్రెంచ్‌భాషే. అందువల్ల ఫానన్ తన ఈ గ్రంథాన్ని ఫ్రెంచ్ భాషలోనే "Les damnes dela terse" అనే శీర్షికన రచించాడు. కన్స్టాటాన్స్ ఫెర్రింగ్‌టన్ ఇంగ్లీష్‌లోకి అనువదించగా 1969కు పూర్వమే న్యూయార్క్‌లోని గ్రోవ్ ప్రెస్ సంస్థ ఈ గ్రంథాన్ని వెలువరించింది. ఆ తర్వాత ఇది లక్షలాది ప్రతులు అమ్ముడుపోగా, వివిధ ప్రపంచ భాషల్లోకి వెళ్లిపోయింది. ఇరవయ్యవ శతాబ్దపు ఆరు,ఏడు,ఎనిమిది దశకాల్లో చర్చనీయాంశంగా మారింది.

అంతేకాదు! రచయితలు అంతర్జాతీయ రాజకీయాన్ని అర్థంచేసుకోవడానికి, వలసాధిపత్యంలో మగ్గిపోయినవాళ్లు ఆ బానిస మానసికత నుంచి బయటపడడానికి ఇలాంటి గ్రంథాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి. అట్లాగే ఒక దేశ సంస్కృతిని అర్థం చేసుకొని దాని మూలాన్ని అన్వేషించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. స్వతంత్ర ఆలోచనా విధానాన్ని అలవరచుకోడానికి దోహదపడుతుంది.

ఈ గ్రంథానికి ఫ్రెంచి నవలా రచయిత జ్యాపాల్ సార్త్ర్ (అస్తిత్వవాద తత్వవేత్త– నోబెల్ పురస్కారం వచ్చినా నిరాకరించినవాడు) ముందుమాట రాస్తూ "ఏంగిల్స్ తర్వాత చారిత్రకక్రమాన్ని స్పష్టమైన వెలుగులోకి తెచ్చినవాడు ఫానన్. ఒక స్థితికి (దశకు) ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించాడు".

"ఆసియా ప్రజలకు యూరప్ నరకం చూపించింది" ఈ పుస్తకాన్ని చదవాలంటే ధైర్యముండాలి. తొలుత ఇది నిన్ను సిగ్గుపడేలా చేస్తుంది. ఇంతకు మార్క్స్ చెప్పినట్టు సిగ్గుపడడం కూడా ఒక విప్లవకరమైన సెంటిమెంట్"

"రైతు తన చేతుల్లోకి తుపాకిని తీసుకోగానే పౌరాణిక మిథ్యలు మసకబారి, నిషేధాలన్నీ తొలగిపోతాయి. అతని మానవత్వానికే ఆయుధం నిదర్శనమౌతుంది. తిరుగుబాటు మొదటి దశలో నువ్వు చంపవలసిందే. ఒక యూరోపియన్‌ను చంపడమంటే ఒక రాయితో రెండు పక్షులను

చంపడమన్నమాట! ఆ రెండు ఎవరంటే అణచివేసే పీడకుడు నశిస్తాడు, పీడితుడు కూడా ఒకే కాలంలో ఎవరిచేతిలోనైతే అణచివేయబడ్డాడో, అతను స్వేచ్ఛాజీవిగా మిగులుతాడు. ఆ విధంగా రైతు మొదటిసారి తన జన్మభూమి మట్టిని పిడికిట అనుభవిస్తాడు".

అల్జీరియా జాతీయోద్యమ కాలంలో ఫ్రెంచి వలసాధిపతుల చేతుల్లో నానా హింసలు అనుభవించిన విప్లవకారుల మానసిక స్థితిని చూసి, చికిత్స జరిపి ఒక నల్లజాతి వలసగా మారిపోతే, దాస్య శృంఖలాల మధ్య ఎంత నికృష్టస్థితికి దిగజారి పోగలదో స్వయంగా గమనించాడు. అల్జీరియా ప్రజలనే కాదు అటు ఆఫ్రికా దేశస్థులను, ఇటు ఆసియా ఖండ వాసులను బ్రిటన్, ఫ్రాన్స్, పోర్చుగల్, స్పెయిన్, హాలెండ్ తదితర యూరప్ దేశాల పాలకులు ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా సాంస్కృతికంగా పీల్చి పిప్పి చేసిన యథార్థాన్ని బహిర్గతం చేశాడు.

ఫానన్‌కు పూర్వమే కార్ల్‌మార్క్స్ "భారతదేశంలో బ్రిటీష్ పాలన" గురించి విశ్లేషిస్తూ వ్యాఖ్యానించిన వాస్తవాన్ని గుర్తుచేసుకుంటే, ఇదే విశ్లేషణ వలసాధిపత్యంలో కాలనీలుగా మారిన ఇతర దేశాలకు వర్తింపచేసుకోవచ్చు.

1853-57 నాటి పరిస్థితుల్లో మార్క్స్ వేసిన అంచనా ఆయన మాటల్లోనే "ఫ్యూడల్ వ్యవస్థలోంచి అభివృద్ధి చెందిన ఇండియన్ పెట్టుబడిదారీ విధానం, ఆనాటి ఆంగ్లేయ పారిశ్రామికవేత్తలు అవలంబించిన అమానుషమైన పద్ధతుల మూలాన తీవ్రరూపాన్ని పొందింది".

భారతీయ సామాజిక వ్యవస్థను ఇంగ్లాండు ఆసాంతం ధ్వంసం చేసింది. కోలుకోలేకుండా దెబ్బతీసింది. పాత వ్యవస్థ నశించి, కొత్త వ్యవస్థ రూపొందకుండా హిందూదేశ ప్రజల ప్రాచీన సాంప్రదాయాల గత చరిత్రను బ్రిటీష్ పాలన తుడిచిపెట్టింది".

ఇదే అంశాన్ని ఫానన్ మరోవిధంగా ఫ్రెంచి వలసలుగా చితికిపోయిన ఆఫ్రికన్ దేశాల నేపథ్యంలో వ్యాఖ్యానించాడు.

ఇక ఫానన్ గ్రంథంలోని ప్రధానమైన అంశాలకు వెడితే ఆనాటి వలస ప్రపంచం రెండు ముక్కలై వుంది. మొదటిది వలస దేశాల్లో నిజమైన అధికారుల పోలీసులు, సైనికులు...! రెండోది ఈ వలసల పెట్టుబడిదారీ వ్యవస్థలోని విద్యా వ్యవస్థ మూలాన తయారైన గుమస్తాలు లేదా ఇతర విద్యావంతులు. లొంగిపోయే రాజీ మనస్తత్వంతో భయస్థులుగా మారిపోయినందువల్ల వారిని అణచిపెట్టడం(పోలీసింగ్) సులువైపోయింది.

వెనుకబడిన, అభివృద్ధి చెందని సమాజాలలో కుటుంబం గురించి లేదా సమూహం గురించి ఒక తీవ్రమైన వాంఛ అంతర్గతంగా ప్రజల్లో వున్న స్వాభావిక లక్షణమని ఫానన్ మనస్తత్వ శాస్త్రరీత్యా వ్యాఖ్యానిస్తాడు. ఇక్కడ 'లిబిడో' అనే పదాన్ని ఉపయోగించిన ఫానన్ ఈ సమాజాలలోని మనుషుల లైంగిక సహజాతాలను, వారి తీవ్ర వాంఛలను మూలశక్తిగా గుర్తించి, అది ఆ తర్వాత వలసాధిపతులపై తిరుగుబాటుగా ఎలా పరిణమించగలదో అనే విషయాన్ని విశ్లేషిస్తాడు.

వలస దేశాల్లో రైతులు మాత్రమే విప్లవకారులు. వారికి పోయేదేమీ వుండదు, వచ్చేదంతా వారికనుకూలమేనని ఫానన్ భావన. దీనికి కారణం ఈ దేశాల్లోని జాతీయ, రాజకీయ పార్టీలు ఏదో ప్రయోగాత్మకంగా సాయుధ బల ప్రయోగాన్ని కావాలనుకున్నా మౌలికంగా సమూలమైన వ్యవస్థ మార్పు వాటి లక్ష్యంకాదు. ఈ జాతీయ పార్టీల బలగమంతా పట్నవాసులే. కార్మికులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, చేతి పనుల వాళ్లు, చిన్న వ్యాపారస్థులు క్రమంగా తమ స్వప్రయోజనాల కోసం వలసపాలనతో రాజీ పడుతుంటారు. కానీ రైతులు అలా కాదని ఫానన్ ఉద్దేశం.

మరో సందర్భంలో ఫానన్ 'ఆకలి భౌగోళికత'ను వర్ణిస్తూ యూరప్ సామ్రాజ్యం విస్తరించిన తీరు గురించి ఇలా అంటాడు "యూరప్ దేశాల సంపన్నత సుఖాలన్నీ నీగ్రోలు, అరబ్బులు, భారతీయులు, పసుప్పచ్చ జాతుల చెమటపై, శవాలపై నిర్మించబడినవే!".

ఈ గ్రంథంలోని మిగతా అధ్యాయాలలో ఫానన్ విశ్లేషించిన మరికొన్ని ముఖ్యమైన అంశాలు.. జాతీయ సంస్కృతి, సాహిత్యం, తిరుగుబాటు కాలంలో హింస, అహింసల ప్రసక్తి, వలసదేశాల్లోని ప్రజల మానసికత, విముక్తికి పూర్వం ఆ తర్వాత!

ఇక అభివృద్ధి చెందని దేశాల్లో నాయకుడు అనేవాడు ఒక నైతిక శక్తిగా నిలుస్తాడు.

"సంపత్తి అనేది శ్రమ ఫలితం కాదని, వ్యవస్థీకృతమైన రక్షితమైన చర్య అని ప్రజలు అర్థం చేసుకుంటారు. ధనవంతులను ఆ ప్రజలు ఏమాత్రం గౌరవించలేరు. ఆ సంపన్నులను తమ రక్తాన్ని పీల్చే జంతువులని, నక్కలని, రాబందులని భావిస్తారు".

"ఇక ఏర్పడే ప్రభుత్వాలకు లేక పార్టీలకు తగిన ప్రజలే వుంటారు. ఆ తర్వాత వెనుకా ముందుగా ప్రభుత్వాలే పాలిస్తాయి" ('జాతీయ చైతన్యంలోని వొడిదుడుకులు' అనే అధ్యాయం నుంచి).

దేశీయ రచయితలకు మూడు రకాల దశలు వుంటాయని ఫానన్ వివరిస్తూ మొదటిది వలసాధిపతుల సంస్కృతిని అర్థం చేసుకుంటాడు. రెండోది తానేమిటో గుర్తు చేసుకుని ప్రజల బాహ్య జీవితాల వర్ణనలతో సరిపుచ్చుకుంటాడు. అరువు తెచ్చుకున్న విమర్శన ప్రమాణాలతో తన జాతి జీవితాన్ని వ్యాఖ్యానిస్తాడు. మూడోది చివరగా ప్రజా పోరాటాలతో మమేకమై, విప్లవకరమైన జాతీయ సాహిత్యాన్ని రచిస్తాడు. ప్రజలను మేల్కొల్పుతాడు.

ఈ గ్రంథం అంతిమ అధ్యాయాన్ని ఫానన్ ఇలా ముగిస్తాడు "యూరప్‌కైనా మనకైనా మొత్తం మానవాళికైనా, కామ్రేడ్స్... ఒక కొత్త జీవితం కావాలి. ఒక నూతన ఆలోచనా విధానంతో ఒక నూతన మానవుడు నడయాడే ప్రపంచం కావాలి".

ఇంతటి విలువైన సమాచారాన్నందించే ఈ పుస్తకాన్ని నా మిత్రులెందరికో చదవమని సూచించాను.



1969లో మొదటిసారి నేను ఈ "ది రెచెడ్ ఆఫ్ ద ఎర్త్" గ్రంథాన్ని సీనియర్ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు ఎ.బి.కె. ప్రసాద్ గారి దగ్గర చూశాను. అప్పటికే "దిగంబర కవులు"గా మూడు సంపుటాలు వెలువరించిన దశ. మా రెండో సంపుటం పీఠికలో "ఈ భూమ్మీద ఆకలి వున్నంత వరకు మార్క్సిజాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీ లేదు" అని దృఢంగా నమ్మిన దశలోనే ఈ గ్రంథం నా చేతిలోకి వచ్చింది. మిత్రులు ప్రసాద్‌గారి దగ్గర ఆ పుస్తకం తీసుకుని, దాదాపు వారం పదిరోజుల దాకా చదివాను. ఆ గ్రంథంలోంచి విస్తృతంగా నోట్సు రాసుకున్నాను. నన్ను విపరీతంగా ఆలోచింపచేసి ఆకట్టుకున్న ఫానన్, మౌలికంగా కొన్ని ముఖ్యమైన సామాజికాంశాలను చెప్పాడనిపించింది. యూరప్‌కు వలస దేశాలుగా ఊడిగం చేసిన దేశాలలో మరీ ముఖ్యంగా బ్రిటన్(ఇంగ్లాండ్)కు బానిస దేశంగా మారిపోయిన భారతదేశంలో అన్ని విధాలుగా చిక్కిశల్యమైన చారిత్రక దురవస్థ గుర్తుకొచ్చింది.



పొటాటో హల్వా



దాల్ పాయసం



స్వీట్ సమోసా

పొటాటో హల్వా

కావలసిన వస్తువులు

బంగాళదుంపలు - పావుకిలో, పంచదార - 1 కప్పు, పాలు - అర లీటరు, నెయ్యి - అర కప్పు, యాలకులు- 10, పచ్చకర్పూరం- కొద్దిగా, కిస్‌మిస్ - మన ఇష్టాన్ని బట్టి.

తయారు చేసే విధానం

బంగాళదుంపలు వుడకబెట్టి తొక్కు తీసెయ్యాలి. దుంపలను మెత్తగా మెదపాలి. దాన్ని మూకుడులో కొద్దిగా నెయ్యివేసి దోరగా వేయించాలి. పాలు బాగా మరగనిచ్చి ఒక కప్పు కోవా చేసుకోవాలి. పంచదార తీగపాకం రానిచ్చి అందులో నేతిలో వేయించిన బంగాళదుంప గుజ్జు వెయ్యాలి. యాలకుపొడి, పచ్చకర్పూరం, వేయించిన కిస్‌మిస్, మిగిలిన నెయ్యి వేసి బాగా కలపాలి. చల్లారిన తర్వాత తింటే బాగుంటుంది. బంగాళదుంపలు మాత్రం పాతవి ఉపయోగించండి. కొత్తవయితే పసరుకంపు కొడుతుంది.

దాల్ పాయసం

కావలసిన వస్తువులు

పెసరపప్పు - 100 గ్రాములు, శనగపప్పు - 100 గ్రాములు, బియ్యం- 100 గ్రాములు, పాలు - 1 లీటరు, కొబ్బరిచిప్పు- 1, పంచదార- 1 కిలో, జీడిపప్పు - 100 గ్రాములు, కిస్‌మిస్ - 50 గ్రాములు, యాలకులు - 5, నెయ్యి - పావుకిలో.

తయారు చేసే విధానం

శనగపప్పు, పెసరపప్పు, జీడిపప్పులు వేరువేరుగా బాగా వేయించి వుంచుకోవాలి. కొబ్బరి కోరి వేరుగా ఉంచాలి. బియ్యం కడిగి ఒక పాత్రలో పోసి దానికి నీళ్ళు చేర్చి వుడకనివ్వాలి. కొంచెం వుడకగానే శనగపప్పు, పెసర పప్పు వేయాలి. సగం వుడికిన తర్వాత పాలు పోయాలి. అన్నం మెత్తగా అయ్యాక పంచదార వెయ్యాలి. ఇప్పుడు



బాద్‌షా



జీడిపప్పులు, కొబ్బరి, కిస్‌మిస్, యాలకులపొడి వేసి బాగా కలియబెట్టాలి. అయిదు నిమిషాల్లో దింపుతామనగా నెయ్యిపోసి మూతపెట్టాలి. వేడిగా స్పూన్‌తో తినడానికి చాలా బాగుంటుంది.

స్వీట్ సమోసా

కావలసిన వస్తువులు

మైదాపిండి - 1 కప్పు, శనగపిండి - 1 కప్పు, పంచదార -1 కప్పు, నెయ్యి - పావు కప్పు, కిస్‌మిస్ - 25 గ్రాములు, లవంగాలు - 4, యాలకులు- 5, జీడిపప్పు - కొంచెం, నూనె/నెయ్యి - 200 గ్రాములు.

తయారు చేసే విధానం

మైదాపిండిలో నీళ్ళు పోసి, బాగా పిసికి ముద్దగా చెయ్యాలి. ఈ పిండిని చిన్న చిన్న ముద్దలుగా చేసి అప్పడాలపీట సాయంతో చిన్న చిన్న పూరీలుగా చేసుకుని వుంచుకోవాలి. శనగపిండి జల్లించుకోవాలి. పంచదారకూడా మెత్తగా దంచాలి. జీడిపప్పు, కిస్‌మస్ వేయించుకోవాలి. ఈ రెండూ బాగా కలపాలి. అందులో జీడిపప్పు, కిస్‌మిస్, పిండిచేసిన లవంగాలు, యాలకులు వేసి కొద్దిగా నెయ్యిపోస్తూ ముద్దగా చేసుకోవాలి. ఇప్పుడు ఈ పిండిని కొంచెం తీసుకుని రెడీగాచేసి వుంచుకున్న పూరీల మధ్య వుంచి మధ్యకి మడవాలి. మడిచి గుండ్రంగా వున్న వైపు వొత్తితే బాగా అంటుకుంటుంది. తర్వాత బూరెల మూకుడులో నూనె లేదా నెయ్యి పోసి కాగనివ్వాలి. అందులో ఈ సమోసాలు వేసి వేయించి అట్టిపెట్టుకోవచ్చు. నిల్వ వుంటాయి. ఈ సమోసాలు చెయ్యడానికి సమోసా కటర్ వుపయోగిస్తే చూడ్డానికి ఇంపుగా వుంటాయి.

బాద్‌షా

కావలసిన వస్తువులు

మైదా - 2 కప్పులు, వెన్న - 100 గ్రాములు పంచదార - అరకప్పు, నెయ్యి - పావుకిలో గసగసాలు- కొంచెం, లవంగాలు -10.

తయారు చేసేవిధానం

పంచదార రోటిలోవేసి మెత్తగా దంచి జల్లెడతో జల్లించి వుంచాలి. మైదాలో పంచదార, వెన్న, కొద్దిగా నీళ్ళు కలిపి బాగా నాననివ్వాలి. తర్వాత గట్టిగా ముద్ద చెయ్యాలి. సపోటా కాయంత పిండిని తీసుకొని అప్పడాల పీటమీద వేసి పరోటాలా పొరలుపొరలుగా వత్తాలి. పొరలుగా మడిచేటప్పుడల్లా కొంచెం నెయ్యిగాని, వెన్నగాని రాస్తూ వుంటే వేయించేటప్పుడు పొరలు బాగా పొంగుతాయి. దాన్ని మళ్ళీ చాపలా చుట్టాలి. చుడుతున్నప్పుడు నెయ్యి రాస్తూ చుడితే మంచిది. తర్వాత కావలసిన సైజులో ముక్కలుగా కొయ్యాలి. ఇవి విడిపోకుండా లవంగాలు గుచ్చాలి. గసగసాలు నేతిలో వేయించి వుంచాలి. ఒక మూకుడులో నెయ్యి బాగా మరిగించాలి. మరుగుతున్నప్పుడే బాద్‌షాలు వేసి దోరగా వేయించాలి. వేగిన తర్వాత మరొక పళ్ళెంలో వేసి వేడిగావున్న వాటిపై గసగసాలు పల్చగా చల్లాలి. చల్లారిన తర్వాత తింటే బాగుంటాయి. ★

నవ్వుల్ - పువ్వుల్

స్టార్టింగ్ శాలరీ

బాస్: నీకు డ్రైవర్‌గా ఉద్యోగమిస్తున్నాను. స్టార్టింగ్ శాలరీ రూ.2000లు.

ఉద్యోగి: మీరు చాలా దయామయులు సార్. స్టార్టింగ్ శాలరీ సరే... మరి డ్రైవింగ్ శాలరీ ఎంత సార్?

స్నేహితుడు

ఓ బద్ధకస్తుడైన విద్యార్థి పరీక్షలకోసం స్నేహితుడి వ్యాసం మాత్రమే చదివాడు. కాని ఆ పరీక్షలో తండ్రి గురించి వ్యాసం వచ్చింది. దీంతో ఆ విద్యార్థి అదే వ్యాసంలో స్నేహితుడు ఉన్న చోటల్లా తండ్రి అన్న పదాన్ని రాశాడు. దాంతో ఆ వ్యాసం ఇలా తయారైంది.

నేను చాలా మంచి తండ్రి(స్నేహితుడి)గా ఉంటాను. నాకు చాలా మంది తండ్రులు(స్నేహితులు) ఉన్నారు. నా తండ్రులలో(స్నేహితులలో) కొంతమంది మగవాళ్లు, కొంతమంది ఆడవాళ్లు ఉన్నారు. నా నిజమైన తండ్రి(స్నేహితుడు) మా పక్కింటాయన.

పిహెచ్‌డి

(ఒక ఇంటర్వ్యూలో)

అధికారి : నీ అర్హత ఏంటి?

వ్యక్తి : నేను పి.హెచ్.డి చేశాను సార్.

అధికారి : అంటే?

వ్యక్తి : నవ్వుతూ... పాస్డ్ హైస్కూల్ విత్ డిఫికల్టీ.

టూ వీలర్

(రవి తన ఆటో చక్రాన్ని తీసేయడంలో చాలా బిజీగా ఉన్నాడు)

రాజు : ఎందుకురా టైర్ తీస్తున్నావు? పంచరైందా?

రవి : నీకు బోర్డు చదవడం రాదా? ఈ పార్కింగ్ స్థలం టూ వీలర్స్‌కి మాత్రమే.

ఎన్ని కట్లో

(ఇద్దరు ఈజిప్టు మమ్మీని చూసి ఇలా మాట్లాడుకుంటున్నారు.)

రాజు : ఎన్ని కట్లు కట్టి ఉన్నాయి! ఇది పక్కా లారీ యాక్సిడెంటే అయి ఉంటుంది.

రమేష్ : అవును. లారీ నెంబరు కూడా ఉంది. బిసి 1760.

రింగ్

(ఒక ప్రియుడు, ప్రియురాలు చాలా సంతోషంగా ఉన్న సమయంలో ప్రియురాలు ఇలా అడిగింది.)

ప్రియురాలు : డార్లింగ్ మన ఎంగేజ్‌మెంట్‌కి నాకు రింగిస్తావా?

ప్రియుడు : ఓ తప్పకుండా! లాండ్ లైన్ నుంచా? మొబైల్ నుంచా?

మంచి డాక్టర్

డాక్టర్ : నువ్వు రెండు గంటల్లో చనిపోతావు. చనిపోవడానికి ముందు ఇంకేమైనా చూడాలని అనుకుంటున్నావా?

పేషెంట్ : ఒక మంచి డాక్టర్‌ని చూడాలని అనుకుంటున్నానండి.

పేలితే...

(ఇద్దరు తెలివితక్కువ దుండగులు కారులో బాంబు పెడుతూ ఇలా మాట్లాడుకుంటున్నారు.)

గిరి : బాంబు పెడుతుండగానే పేలితే నువ్వు ఏం చేస్తావు?

రావు : ఐతే ఏంటి? నా దగ్గర ఇంకోటి ఉందిగా...

జోక్స్ పంపాల్సిన మా చిరునామా : **నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.**





చిన్నా పెద్దా
తేడా లేకుండా అందరూ
సంతోషంగా జరుపుకునే
పండుగ దీపావళి. ఎందుకంటే ఆ రోజు
అందరికీ ఇష్టమైన టపాసులు కాల్చుకోవచ్చుకదా!
గుమ్మాలు, బాల్కనీలు, కిటికీలు ఇలా ఇల్లంతా దీపాలతో
అలంకరిస్తాం ఆ రోజు. బంధువులతో, స్నేహితులతో ఎంతో
సంతోషంగా, హుషారుగా ఉంటాం. కాకరపూలు,
వెన్నెలమడుగులు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, రాకెట్లు, వంకాయ
బాంబులు ఇలా ఎన్నో టపాసులు పేలుస్తాం. మరి ఇంత సంతోషంగా ఉన్న
సమయంలో విషాదం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. అందుకే
కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలూ లేకుండా పండుగను జరుపుకోవచ్చు.

చిరునవ్వుల దీపావళికి చిరుజాగ్రత్తలు

దీపావళి సమయంలో మనం జాగ్రత్తగా ఉండకపోవడం, నిర్లక్ష్యంగా ఉండడం వల్ల అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదముంది. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మనం ఈ ప్రమాదాలను అరికట్టవచ్చు. దీపాల వెలుగులన్నా, బాంబుల శబ్దాలన్నా మనందరికీ ఇష్టం. కానీ ప్రమాదాలు జరిగితే వాటికి గురైన వాళ్లు మాత్రమే భరించాల్సి వస్తుంది. మీరు అగ్నిప్రమాదాలను అరికట్టాలని అనుకుంటే దయ చేసి ఒకసారి ఈ జాగ్రత్తలను చదవండి.

1. మీరు మీ టపాసులను పొడి ప్రదేశంలో పిల్లలకు, జంతువులకు, మంట, వేడిని కలిగించే వస్తువులకు దూరంగా భద్రపరుచుకోవాలి. వాటిని పేల్చేటప్పుడు మాత్రమే బయటికి తీయాలి. వాటిని దారిలోగానీ, మెట్ల దగ్గర గానీ ఉంచొద్దు.

2. పెంపుడు జంతువులకు పెద్ద శబ్దాలన్నా, మెరుపులన్నా భయం. టపాసులు కాలుస్తుంటే వెలుగులు చూసినా, పెద్ద పెద్ద శబ్దాలు విన్నా అవి బెదురుతాయి. అందుకని టపాసులు కాల్చేటప్పుడు వాటిని ఇంట్లోనే ఉంచి ఆ శబ్దాలు వినపడకుండా అన్ని తలుపులూ, కర్టెన్లూ వేయాలి.

3. ఒకసారి కాల్చినవి పేలకపోతే మళ్లీ వాటిని పేల్చడానికి ప్రయత్నించకండి. చిన్నపిల్లల చేతులకు టపాసులు ఇవ్వకండి. ఎదుటి వారి మీద ఎప్పుడూ టపాసులు వేయొద్దు. అది నేరం కూడా. టపాసులను జేబుల్లో పెట్టుకోవద్దు. గాజు, లోహపు పాత్రల్లో టపాసులను కాల్చవద్దు. సొంతగా దీపావళి బాంబులను తయారు చేయొద్దు.

4. టపాకాయలు కాల్చేటప్పుడు వేలాడే, వదులుగా ఉండే దుస్తులు వేసుకోకూడదు. అవి త్వరగా మంటను అందుకుంటాయి. వంటికి అతుక్కుని ఉండే కాటన్ బట్టలు వేసుకోవాలి. పొరపాటున మంట అంటుకుంటే భయంతో

పరిగెడతాం. కాని అలా చేయకూడదు. అక్కడే ఆగి మంటలు చల్లారిపోవడానికి నేలపై అటు ఇటు దొల్లాలి.

5. కొన్ని టపాసులకు నిప్పు అంటించినప్పుడు పేలదు. అలాగని దానికి ఉన్న నిప్పు చల్లారిందని అనుకోలేం. నిప్పు ఉందో లేదోనని వంగి చూడకూడదు. లేదా చేతితో పట్టుకోవద్దు. అవి అకస్మాత్తుగా పేలే ప్రమాదముంది. చిన్నపిల్లలను అసలు వాటి దగ్గరికి పోనివ్వకూడదు. పొరపాటున కూడా వాటిని మంటల్లోకి విసరకూడదు. అలాంటి వాటి మీద నీళ్లు పోయాలి.

6. రకరకాల బాంబులు పేలుస్తున్నప్పుడు వాటి మీదున్న జాగ్రత్తలను చదవాలి. రాకెట్‌ను రాకెట్ లాంచర్‌నుపయోగించే కాల్చాలి. సీసాలతో కాల్చకూడదు. చేతులకు గ్లౌజులను వేసుకుని, చేతులను దూరంగా ఉంచి కాకరపూలను కాల్చాలి. అవి కాలడం పూర్తయిన వెంటనే ఇనుప చువ్వలను నీళ్లలో ముంచాలి. ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు వాటిని చేతికి ఇవ్వొద్దు.

7. మద్యం సేవించి టపాసులు కాల్చొద్దు. అది తీసుకున్నప్పుడు వాటికి దూరంగా ఉండడం మంచిది.

8. పిల్లలు చేతిలో బాంబులు అసలు పేల్చొద్దు. ఒక్కోసారి కాకరపూలు కూడా పేలే ప్రమాదముంది. కాబట్టి పిల్లలకు ముందుగా ప్రమాదాల గురించి చెప్పాలి.

9.పెద్దగా గాలి వీస్తున్నప్పుడు టపాసులు పేల్చకపోవడమే క్షేమం. టపాసులు కాలుస్తున్నప్పుడు అనవసరమైన రిస్కులు తీసుకోకపోవడం మంచిది.

10. త్వరగా అంటుకునే చెక్కలు, గుడ్డలు, పేపర్లు దీపాలకు దూరంగా ఉండేటట్టు జాగ్రత్తపడాలి. ఎలక్ట్రిక్ దీపాలను లోహాలతో చేసిన పోల్స్‌పై పెట్టకూడదు. కరెంటు షార్టుసర్క్యూటై పోల్ పట్టుకున్న వారికి షాక్ వచ్చే ప్రమాదముంది.

- బాణా సంచాను ఆరుబయట ఖాళీ ప్రదేశంలోనే కాల్చాలి.
- రిజస్టర్డ్ దుకాణాల్లోనే కొనాలి.
- టపాసులు కాల్చేటప్పుడు చేతులను కళ్లలో, ముక్కులో, నోట్లో పెట్టుకోకూడదు.
- ఒకే సారి రెండు మూడు టపాసులు పేల్చొద్దు. ఒదాని తరువాత ఒకటి కాల్చాలి.
- చూసేవారు సురక్షిత దూరం నుంచి చూడాలి.
- టపాకాయలు పేల్చేటప్పుడు పొడవాటి కొవ్వొత్తులను ఉపయోగించాలి.
- మంట వచ్చిన వెంటనే ఆర్పేయడానికి రెండు మూడు బకెట్ల నీరు అందుబాటులో ఉంచుకోండి.
- ఎవరికైనా మంట అంటుకుంటే బట్టలు తీసి, శుభ్రమైన దుప్పట్లతో కప్పాలి. వెంటనే నిపుణుడి దగ్గరికి తీసుకెళ్లాలి.
- ఒక వేళ కళ్లలో నిప్పు రవ్వలు పడితే నీళ్లతో కడుక్కుని ఆసుపత్రికి వెళ్లాలి.
- తప్పని సరిగా చెప్పులు వేసుకోవాలి.
- పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు వెంట ఉండాలి.
- మొత్తం టపాసులన్నీ బయటికి తీసుకొచ్చి కాల్చకూడదు. పొరపాటున అందులో నిప్పురవ్వలు పడితే చాలా ప్రమాదం. అందుకే వీటిని ఇంట్లోనే సురక్షిత ప్రదేశంలో పెట్టి ఎప్పటికప్పుడు తెచ్చుకోవాలి.
- పండుగ రోజు బయటి దండేల మీద బట్టలు లేకుండా చూసుకోవాలి.
- టపాసులు కాల్చడం అయ్యాక సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. ఆ తర్వాతే భోజనం చేయాలి.

★





సీరియల్

గని

<u>జరిగినకథ :-</u>

పన్నెండు గంటలపాటు చేయాల్సిన పనిని ఎనిమిది గంటల్లో చేయిస్తున్న విషయాన్ని కార్మికులకు విశదపరిచి, సూటిగా చెప్పాలనుకుంటాడు బికాస్. "మనం పిరికి పందలం కాదు. మన బలం అంతా ఇంతా కాదు. ఆంగ్లేయులతో పోరాడినప్పుడు ఇతరదేశాల నుంచి ఆయుధాలను ఓడల్లో తెచ్చాం మనం. దేశం లోపల వాళ్ల ఆయుధాగారాల్లో ప్రవేశించి, ఆయుధాలను కైవసం చేసుకున్నాం. అంతా ఐకమత్యంతోనే సాధ్యమౌతుంది. కార్మికులు ఒక్క తాటి మీద నడిస్తే అపజయం దరిచేరదు. పతనం కలుగదు. కార్మిక శక్తికి చావులేని వరం వుంది. అందుకే సమాజం అభివృద్ధి చెందుతోంది" అంటూ తన మనసులోని భావాలను వెల్లడిస్తాడు బికాస్. తర్వాత దేశ వ్యాప్తంగా జరగనున్న సమ్మె తాలూకు ఏర్పాట్ల గురించి చర్చించనున్నందువల్ల మామూలుగా సమావేశాలకు రాని వారు కూడా వస్తారు. రానున్న సమ్మె గురించే వారు ఎవరకు తోచినట్టు వారు ఊహించుకుంటారు. తదుపరి కార్యక్రమం గురించే ఆలోచిస్తుంటారు. ఆ తర్వాత...



తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ఇరవై ఎనిమిదవ భాగం)

ఎగుడు దిగుడుగా ఉన్న మట్టిబాట. నిల్వ ఉంచిన చోటు నుంచీ బొగ్గును ఎక్కించుకున్న లారీలు దారిపొడవునా దుమ్ము రేపుకొంటూ వెళ్తున్నాయి. ఉదయపు మంచుబిందువుల తడి నిండిన మట్టి రేణువులు గనికేసి నడిచివెళు న్న కార్మికుల ముఖం మీద, వెంట్రుకల మీద, బట్టల మీద.

బురద నిండిన బాటలో చెప్పులతో నడవలేక వాటిని చేతిలో పట్టుకుని నడుస్తున్నారు కొందరు. గనిలో చెప్పుల్లేకుండా పనిచేయడానికి వీలవదు. కాళు ళ వాచిపోతాయి.

కార్మికులు తమ టోకెన్ బ్యాటరీ నెంబరు, పొదగబడిన హెడ్‌లైటు తీసుకుని టోకెన్ పంచ్ చేసి, గనిలో దిగారు. వాళ్ళను తమ తమ గుహల వద్ద దించే యంత్రాల చప్పుడు కర్ణకఠోరంగా ఉంది.

బావిలోకి రాళ్ళు వేస్తున్నట్టు, గుహల వద్ద కార్మికుల్ని దించుతాయి యంత్రాలు. పాతాళలోకంలో భూతాలు కదులుతున్నట్టు గనిలో కార్మికులు కొరివిదెయ్యాల్లా కదులుతున్నారు. వారగా ఉన్న నీటిపాయలో మామూలుకన్నా ఊట ఎక్కువగా ఉంది.

జీవితం అర్థరహితంగా అనిపించింది. బురదగుంటలో పొర్లే పందుల్లా బొగ్గు గనిలో పనిచేయాలి. కాళ్ళూ, చేతులూ చలనం కోల్పోతాయి. పై భాగమంతా నొప్పి పెడుతుంది. కూచుంటే నిద్ర ముంచుకొస్తుందేమోనని భయం. బొగ్గును తవ్వి పోస్తున్నప్పుడు నరాలు పెటేలుమని చిట్లిపోతున్నట్టు అదురుతుంటాయి. కొన్ని సార్లయితే ఎవరో ఇనుపకమ్మీతో నరాన్ని లాగుతున్నట్టు ఎంతో సలపరం. నిద్రనూ, అలుపునూ తాత్కాలికంగా ఆపుకోవడం కోసం వేళ్లను కొరకడం, శరీరాన్ని గట్టిగా గిల్లుకోవడం వంటి చర్యలకు పాల్పడతారు.

చంచల్ కుమార్, తన బృందంతో బొగ్గును తవ్విపోసే చోటికి చేరుకున్నాడు. ఆ స్థలాన్ని 'కోన్ బేస్' అంటారు. నీళ్ళు వేగంగా ఊరుతుండడం అతడి మనసులో అలజడి రేపింది. 'మండుహాజీ'ని చూసి 'ఇవాళ గనితల్లికి ఏదో దుఃఖం కలిగినట్టుంది. మామూలుకన్నా ఎక్కువగా కన్నీళ్ళు కార్చుతోంది' అన్నాడు భయంతో ముడుచుకుపోయిన చెంపలతో.

మండుహాజీ కళ్ళు బాగా లోపలికి పీక్కుపోయాయి. పిల్లిని చూసి బెదిరిన కోడిపిల్లల చూపుల్లాంటి చూపులు... "ఏదైనా ప్రమాదం జరుగుతుందంటారా?" అని అడిగాడు.

"ఏమో గనితల్లితో ఎన్నేళ్ళ అనుబంధం! ఆ తల్లి తన బిడ్డ దగ్గర ఏదో చెప్పాలనుకుని నోరు తెరవలేక ఏడుస్తున్నట్టు అనిపిస్తోంది" .

"అలా ఏదైనా జరిగితే మంచిదే. మనం ఇప్పుడేం సుఖం అనుభవిస్తున్నాం? పేదరికం.. నిత్యం దుఃఖం.. అయినా మనల్నే నమ్ముకొన్న పెళ్లాం, బిడ్డల కోసం విషాన్ని కూడా అమృతంగా భావించాల్సి ఉంది" అన్నాడు మండుహజీ.

సుకుమార్ బావురి ఎండిపోయిన కళ్ళతో చూస్తూ 'రేపు మా అమ్మాయికి నిశ్చితార్థం. ఎంత అనందంగా ఉందో తెలుసా? ఇంతకాలం కంటికి రెప్పలా కాపాడాను. ఆ బాధ్యత మరొకరికి బదిలీ అవుతోందని సంబరంగా ఉంది, అమ్మాయి దూరమవుతోందన్న బాధ ఉన్నా" అన్నాడు.

మండుహాజీ ఆశ్చర్యమూ, కుతూహలమూ ధ్వనించే స్వరంతో 'ఇన్నాళ్ళూ చెప్పలేదేం?' అన్నాడు.

"సమయం వచ్చినప్పుడే కదా చెబుతాం. అబ్బాయికి పల్లెటూళ్ళో పచారీ కొట్టుంది. దాన్ని పెద్దది చేయడానికి ఆర్థికంగా సహాయం చేయమన్నారు"

"సర్లే పెళ్లి సవ్యంగా జరిగితే అదే పదివేలు. మాకు పప్పన్నం ఉంది కదా!" అన్నాడు కొంటెగా నవ్వుతూ మండుహాజీ.

కనురెప్పలల్లాడిస్తూ "పప్పన్నానికేం భాగ్యం? చదివింపులు ఉన్నప్పుడు పప్పన్నం ఉండదా? మాకు వండి పెట్టాల్సింది మీరే కదా!" అన్నాడు

సుకుమార్.

పక్కనే ఉన్న మునిలాల్ "మీ ఇంట్లో రేపు నిశ్చితార్థం. పై వారం వీళ్ళ ఇంట్లో పూలిముడుపు. ఇద్దరూ లోతైన మనుషులు సుమా! రెండు రోజులు ముందే చెబితే కడుపు ఖాళీగా ఉంచుకొనేవాళ్ళం కదా!" అనడంతో అక్కడున్న వాళ్ళంతా గొల్లున నవ్వారు.

దొంగతనంగా పాలు తాగి, బెదురు చూపులు చూసే పిల్లిలా చూశాడు మండుహాజీ. "సింహంలా నడయాడాలని ఉన్నా ఎలుకపిల్లలా దాగాల్సిన పరిస్థితి.. నా కథ కూడా ఇలాంటిదే. పూలిముడుపును కూడా పెళ్లిలా చెయ్యాలంటున్నారు వియ్యంకులు. పెళ్లి కోసం చేసిన అప్పే ఇంకా తీరలేదు. మళ్లీ ఇంకో అప్పా అని మనసు విలవిలలాడుతోంది. అందువల్ల నేనింకా ఓ నిర్ణయానికి రాలేదు. అందుకే చెప్పలేదు" అన్నాడు.

చప్పిడి ముక్కు మసక కళ్ళ బౌరి "ప్రేమబంధం కన్నా ధన సంబంధం బలీయమైందని అర్థమవుతోంది. అది చొరబడని తోవంటూ లేదు. దేన్నయినా నిర్దాక్షిణ్యంగా కాలరాస్తుంది. ఇంతకంటే ఎక్కువ ఆలోచిస్తే అమ్మాయి బతుకు నాశన మవుతుంది... పని జరగాలి. అదే ముఖ్యం. మా గురించి చింతించవద్దు" అన్నాడు తమ అశక్తతను చాటుతూ.

"నీకో విషయం తెలుసా? పిన్ని దగ్గర అప్పు తీసుకుందామని ఒకామె బయలుదేరితే, ఈతాకు చాపను చీరగా చుట్టుకొని ఎదురొచ్చిందంట ఈ మహాతల్లి. ఇప్పుడు ప్రతి ఒక్కరి పరిస్థితీ అదే. కడుపు చించుకొంటే కాళ్ళమీద పడుతుంది. మాపిల్లలిద్దరూ పాలకోవా కావాలని వారం రోజులుగా సతాయిస్తున్నారు. చేతిలో డబ్బుల్లేక మిన్నకుండిపోయాను. ఇవాళ జీతం రోజు కదా! అందుకని ఇవాళ తెచ్చిస్తానని చెప్పాను. రుణమూ, సెలవు తాలూకు మినహాయింపూ పోతే చేతికి ఎంతొస్తుందో తెలీదు. భార్య చింకిబట్టలతోనే నెట్టుకొస్తోంది. ఎలాగైనా పాలకోవా, రవికబట్టా కొనుక్కెళ్ళాలి. మనకు కష్ట పడనవసరం లేకుండా లభించేవి కష్టాలు మాత్రమే" అన్నాడు ఎత్తుపళ్ళ మండల్.

పిల్ల తెమ్మెర వీయడంతో, దేహానికీ, మనసుకూ హాయిగా అనిపించింది.

గనిలోపలి భాగంలో కొత్తగా బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. సర్వేయర్ గుర్తించి నెంబరు కేటాయించిన స్థలంలో మాత్రమే తవ్వకం చేపట్టాలి. అక్కడ బొగ్గు తవ్వేపని పూర్తికాగానే కొత్తగా స్తంభం నాటి చిన్న చిన్న పేలుళ్ళతో బొగ్గు దిబ్బల్ని చీల్చాలి. ఒకచోట కొత్త స్తంభాన్ని తవ్విపోసే పని ప్రారంభమైంది.

ఆ గనిని ఆనుకొని ఉన్న స్థలంలో బొగ్గునిల్వలు ఖాళీ అయిపోవడంతో దాన్ని మూసేశారు. దాన్ని ఆనుకొని ఉన్న స్థలాల్లో బొగ్గును తవ్వి పోయడానికి పూనుకున్నప్పుడు కచ్చితమైన అంచనా తయారు చేయాల్సి ఉంటుంది. అలా చేయని పక్షంలో ఒక్కోసారి చిన్న విపత్తు నుంచి పెద్ద ఆపదదాకా దేన్నైనా ఎదుర్కోవాల్సి ఉంటుంది. విషవాయువుల్ని పీల్చడం వల్లో, మంటలు రేగడం వల్లో, కాలువ తెగడం వల్లో లోపల ఉన్న కార్మికులు మరణించే ప్రమాదముంది.

ప్రకృతి నియమాలకు విరుద్ధంగా తమ బతుకుదెరువు కోసం మనుషులు ఐదొందల అడుగుల నుంచీ వెయ్యి అడుగుల లోతుకు దిగాల్సి ఉంది. ఆకలి చిచ్చును ఆర్పడం కోసం వాళ్ళు నరకంలో జీవించడానికైనా సిద్ధంగా ఉన్నారు. ఆకలి చిచ్చు ఆరినప్పుడే హేతుదృష్టి కలుగుతుంది. వాళ్ళు అన్ని రకాల బానిసత్వం నుంచీ బయట పడడానికి అది ఎంతో ఉపకరిస్తుంది.

అలసిపోయిన ఎద్దు మొగం లాంటి మొగం కలిగిన మిత్రా అడిగాడు 'ఇవాళ బికాస్ సెలవు పెట్టాడా?'

జతకట్టడానికి మూచూచే మేకపోతులా ముక్కును తిప్పుతూ "బికాసా... సమ్మెకు అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించడానికి కార్మికసంఘాల సమైక్య సమావేశానికి వెళ్లాడు' అన్నాడు.

కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తూ అక్కడికి వచ్చి చేరాడు మైనింగ్ గుమాస్తా. "ఏం గురూ! సమ్మె ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?" అని అడిగాడు దిలీప్ పాశ్వాన్‌ను, వివరాలు రాబట్టుకోవాలన్న దురుద్దేశంతో.

"మిమ్మల్ని కాదని మేమేం చెయ్యగలం? మిమ్మల్ని నమ్ముకుని బతికేవాళ్ళం కదా!" అన్నాడు దిలీప్ లౌక్యంగా.

"మీకు ఎంతటి సమానత్వం సిద్ధించింది! అధికారులతోనే కాకుండా, ఒక్కోసారి మంత్రులతో కూడా సరిసమానంగా కూచుని చర్చలు జరుపుతున్నారు. మా బతుకులే రెంటికీ చెడ్డ రేవడిలా తయారయ్యాయి. అడకత్తెరలో పోకచెక్కలా ఇరుక్కున్నాం" అన్నాడు. అసంఖ్యాకమైన దురాలోచనలు, కుట్రలు అతడి మాటల్లో అంతర్లీనంగా ఉన్నాయి.

"కార్మికులు దాపరికమెరుగరు. కుట్రలూ, కుతంత్రాలూ వాళ్ళకు తెలియవు. శ్రమకు తగ్గ ఫలం దక్కడం లేదన్న బాధ ఉన్నా, యథార్థానికి ప్రతిబింబం మాత్రమే. అందులో కనిపించేది బలవంతంగా అదిమిపెట్టిన ఆకలి మాత్రమే" అన్నాడు దిలీప్, మైనింగ్ గుమాస్తాకు ప్రత్యుత్తరమని కాకుండా మామూలుగా చెబుతున్న ధోరణిలో. అయినప్పటికీ, ఈ అభిప్రాయ ప్రకటనను తనపై పరోక్షంగా చేసిన దాడిగా భావించాడు మైనింగ్ గుమాస్తా.

"నేను అబద్ధమేమీ చెప్పడం లేదుగా! కార్మికవర్గం అధికారంలో ఉన్న దేశాల్లో వాళ్ళ ఆకాంక్షలే కదా అమలులోకి వస్తున్నాయి! మీరు గనుల్ని జాతీయం చేయాలని పోరాడారు. సాధించారు కదా? పుట్టుకతో అందరూ సమానులే అన్నదే మన అమృతవాణి, కానీ నా నుదుటిరాత వక్రించినట్టుంది. ఇలా అనుభవిస్తున్నాను. కలియుగం అంతమైతే అంతా సరిపోతుంది" ఒకదానికొకటి పొంతనలేని మాటల్తో తన మౌఢ్యాన్ని వెళ్ళగక్కాడు మైనింగ్ గుమాస్తా.

దిలీప్ పాశ్వాన్‌కు అణుచుకోలేనంత ఆగ్రహం కలిగింది. పెదవి కదిపితే దేనికి దారితీస్తుందోనన్న జంకుతో మనసులో ఇలా అనుకున్నాడు. "సమానత్వం అనే మాట ఎంత పలుచనైపోయింది! ఒకవైపు అదొక కనీసపు మానవ విలువ అని కార్మికులు గ్రహించకపోగా, మరోవైపు పుట్టుకతో మనుషులంతా సమానమేనని మతాచార్యుల నుంచీ మభ్యపెట్టే రాజకీయ నాయకుల దాకా అందరూ వల్లిస్తున్నారు. అయితే కార్మికుల దేహాలు ఎముకలతోనూ, నరాలతోనూ రూపొంది, కండతోనూ, చర్మంతోనూ కప్పబడి ఉందని గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. వాళ్ళు యంత్రాల్లా పనిచేస్తారని భావిస్తారే తప్ప, వాళ్ళకూ హృదయం ఉందని గానీ, భౌతికశ్రమ వల్ల శరీరభాగాలు అరిగిపోతాయని గానీ గుర్తించరు. వాళ్ళకూ ఆకలేస్తుంది. వాళ్ళ నాలుకలూ రుచులు గ్రహిస్తాయి. అధికశ్రమ వల్ల దేహమంతా నొప్పెడుతుంది అని గ్రహించరు. పుట్టుకతో అందరూ సమానులేననడం అందమైన అబద్ధం. ఆకలితో అల్లాడుతోన్న వ్యక్తి ఎదుట పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి, వీటిని చూస్తూ ఉండు. నీ ఆకలి తీరుతుంది అనడం లాంటిది. బీదవాళ్ళు ఎంతగా అణిగిమణిగి ఉండాలి!

దిలీప్ మనసులోని భావాలు అతడి మొహంలో కొంతమేర ప్రతిబింబించడం పసిగట్టాడు మైనింగు గుమాస్తా. అతడితో దీన్ని గురించి చర్చ కొనసాగిస్తే అధికారికంగా తనకున్న పట్టు కాస్తా సడలిపోతుందని భావించాడు. "సరే! పని కానివ్వండి మీరేం చేసినా, బొగ్గు పరిమాణం మాత్రం తగ్గకూడదు. దాన్ని ఏ సంఘమూ సమర్థించజాలదు" అంటూ తన అధికారాన్ని ప్రదర్శించి, అక్కడ్నుంచి తప్పుకున్నాడు.

ooo

గనిలో బొగ్గును తవ్వితీసే పని యథాప్రకారం త్వరితగతిలో సాగుతోంది. హఠాత్తుగా ఎక్కడో దూరం నుంచీ పెద్ద శబ్దం. ఏదో ప్రమాదాన్ని సూచిస్తూ ఆర్తనాదాలు వినిపించసాగాయి. విషవాయువు వ్యాపిస్తోందా? ఎక్కడైనా మంట లేచిందా? కాలువ తెగిందా? ప్రాణనష్టం జరిగిందా? దేనివల్ల ఇంత గందరగోళం... చీకటి గుహలో దయ్యాన్ని చూచి జడిసిన వాళ్ళలా వెర్రిగా పరుగెత్తడం దేనికి! బతుకుతీపి కాళ్ళకు మనోవేగాన్ని సమకూర్చుతుంది కాబోలు! ఏమీ అర్థం కావడంలేదు. ఒకరి వెంట మరొకరు పరుగుదీస్తున్నారు. అలా పరుగెత్తడానికి కారణం ఏమిటన్నది వాళ్ళ బుద్ధికి అందకపోయినా ప్రమాదం పొంచిఉందని మాత్రం వాళ్ళ మనసుకు తెలుస్తూనే ఉంది.

ఏమైనప్పటికీ ఇకలోపల ఉండడం కుదరదు. ఊపిరాడని చీకటి గుయ్యారంలో భయంతో, దిగులుతో కునారిల్లుతూ చావడం కన్నా బయట వెలుతురులో ఒక్కర్నొకరు కళ్ళారా చూసుకుంటూ కన్నుమూయడం మేలని భావించారు.

(ఇంకావుంది)

చుక్కలు కలిపేస్తే...

సరిచేస్తే పోలా...!



ఫ్రెండ్స్! కింద కొన్ని జంతువుల పేర్లు గజిబిజిగా వున్నాయి. వాటిని సరైన క్రమంలో పెట్టి ఆ జంతువుల పేర్లు చెప్పేస్తారా.

రాసేద్దామా...

పిల్లలూ...ఇక్కడున్న బాక్సులో కొన్ని అక్షరాలు, వాటిపక్కనే బొమ్మలు కూడా ఉన్నాయి. ఆ బొమ్మలకు సంబంధించిన అక్షరాలే అక్కడున్నాయి. మీరు చేయాల్సిందేంటంటే ఆ బొమ్మలను ఇంగ్లీషులో ఏమంటారో రాయాలి. సరేనా...





నేర్చుకుందాం

నిఖత్ ఖాతున్,
7వ తరగతి,
ఇడెన్ హై స్కూల్,
మౌలాలి,
హైదరాబాద్.

ఎం. శ్రీనివాస్,
9వ తరగతి,
శాలి గౌరారం, నల్గొండ.

ఎ. వెంకటేశ్వర్లు
9వ తరగతి,
వై.పాలెం, ప్రకాశం.

రంగులేసేద్దాం

చిన్నారులూ...కింద ఏదో బొమ్మ అర్థం అయ్యీ కానట్టు వుందికదూ. దీనికి చక్కగా మేం చెప్పే రంగులు వేసేయండే. 1. నీలం, 2.బూడిద రంగు, 3.చాక్లెట్ రంగు, 4. ఆరంజ్ రంగు, 5. ఎరుపు, 6. పసుపు





నీడ బొమ్మలు చేద్దామా!

పిల్లలూ... మీకు నీడలో బొమ్మలు చేయడం తెలుసా? ఎలాగంటే ఒక గదిలో లైట్లన్నీ తీసేసి కొవ్వొత్తి వెలుతురులో మీ చేతి వేళ్లను బొమ్మలో చూపిన విధంగా కదిలించి చూడండి. అయితే ఆనీడను గోడపై పడేట్టు చేయాలి. ఏదో ఒక ఆకారం వస్తుంది కదూ. చూశారా ఇలా జంతువుల ఆకారాలు, కొంతమంది ప్రముఖుల ముఖాలు కూడా చేయొచ్చు. ఈవారం మీకోసం ఏనుగు తల, మేక తలను తీసుకొచ్చాం. మరి ప్రయత్నించి చూస్తారా.

జవాబులు

1.tiger, 2. kangaroo, 3.elephant, 4.monkey,5. lion.

pigeon, nut, ark , teacup, kite, fruit, lid.





బతుకు వెత... బంగారు నేత...

- కె.అంజన

మామూలుగా అయితే కంజీవరం చిత్రం గురించి ఎవరూ పట్టించుకునేవారు కాదేమో! ఇతర ఆర్ట్ చిత్రాల్లాగే ఇది కూడా ఎప్పుడో వచ్చి ...ఎక్కడో ఆడిఆడక వెళ్లిపోయేది. కానీ చిత్రాన్ని తీసినవారూ, అందులో ప్రధాన పాత్ర పోషించిన వారూ సామాన్యులు కాదే! అందుకే 2007వ సంవత్సరానికి గాను ఉత్తమ జాతీయ చిత్రం, ఉత్తమ జాతీయ నటుడి అవార్డు పొందింది. దేశవ్యాప్తంగా ప్రేక్షకులు, పత్రికలు, మీడియా దృష్టిని ఆకట్టుకుంది. ఆలోచింపచేసింది.

పట్టుచీరలకు ప్రసిద్ధిగాంచిన కాంజీపురంలోని చేనేత కార్మికుల స్థితిగతుల నేపథ్యంలో అల్లిన కథ 'కంజీవరం'. కథానాయకుడు కాంజీపురం దగ్గర్లోని ఓ కుగ్రామానికి చెందిన నేత కార్మికుడు. కార్మిక నాయకుడు కూడా. పెళ్లి నాటికి తన కుమార్తెకు పట్టుచీర కొనిస్తానని మాట ఇస్తాడు. కార్మిక నాయకుడిగా తను నమ్మిన సిద్ధాంతానికి, పేద చేనేత కుటుంబీకుడిగా తను కన్న కలలకు నడుమ నలిగిపోయిన వ్యక్తి జీవితంలో జరిగే సంఘటనల సమాహారమే 'కాంజీవరం'. పడుగుపేకల్లా చిక్కగా అల్లుకున్న ఈ సినిమా కథ, చిత్రీకరణ, నటీనటుల విశేషాలను ఈవారం అట్టమీది కథలో రేఖామాత్రంగా స్పృశిద్దాం.

'కంజీవరం' చిత్రం స్వాతంత్ర్యానికి పూర్వపు ఇతవృత్తంతో సాగుతుంది. జీవితాంతం ఎంతో కళాత్మకంగా ఎన్నో వందలు, వేల పట్టు చీరలు నేసిన చేనేత కార్మికులు ... ఒక్కటంటే ఒక్క పట్టుచీర కొనుక్కోలేని దుస్థితిలో వున్నారన్న కథతో ప్రియదర్శన్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. అదీ 1920 నుంచి 1948 మధ్య జరిగిన సంఘటనలను హృద్యంగా, చిక్కగా తెరకెక్కించారాయన. కథ యావత్తూ ఎంతో బిగువుగా నడుస్తుంది. సినిమా తొలి ఫ్రేమ్ మొదలుకొని చివరి ఫ్రేమ్ వరకు ప్రేక్షకుడిని కదలనివ్వకుండా కూర్చోబెడుతుంది. అందులో జరిగే సంఘటనలు ప్రేక్షక హృదయాలను మెలిపెట్టి కన్నీటితో తడిపేస్తాయి. ప్రధానపాత్రధారులైన వేంగడం (ప్రకాష్‌రాజ్), అతని భార్య అన్నం (శ్రేయా రెడ్డి), కుమార్తె తామరాయ్ (షమ్ము) పాత్రలు అత్యంతసహజంగా



వుంటాయి. ముఖ్యంగా ప్రకాష్‌రాజ్ చేనేత కార్మికుడిగా లీనమై నటించాడు. దాదాపు రెండు గంటలపాటు సాగే ఈ చిత్రాన్ని ఆ కాలపు నేపథ్యానికి తగ్గట్టుగా సిపియా టోన్‌లో చిత్రీకరించడం సినిమాకు మరింత గాఢతను తీసుకొచ్చిపెట్టింది. పర్సెప్ట్ పిక్చర్ కంపెనీ, ఫోర్ ఫ్రేమ్స్ నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే 'పామ్ స్ప్రింగ్స్, దుబాయ్, పుసాన్,టొరంటో' అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది.

కథలోకెళితే...

పెరోల్ మీద కన్న కూతుర్ని చూడ్డానికి వేంగడం బస్సులో బయలుదేరడంతో చిత్రం మొదలౌతుంది. పగిలిన కళ్లద్దాల్లోంచి జోరున కురుస్తున్న వర్షాన్ని చూస్తూ ... తనకు ఎదురయ్యే సన్నివేశాల్లోంచి గతం గుర్తుచేసుకుంటుంటాడు. అలా సినిమా చాలా వరకు వర్తమానంలోంచి గతంలోకి నడుస్తూ వుంటుంది.

తను చేసుకోబోయే అమ్మాయి పెళ్లి రోజున పట్టుచీర కట్టుకోవాలన్నది వేంగడం కోరిక. అలా పట్టుచీర కట్టుకున్న భార్యను పొందిన తొలి చేనేత కార్మికుడిగా నిలిచిపోవాలన్నది అతని ప్రగాఢవాంఛ. అదేవిషయాన్ని గ్రామంలో తరచూ చెప్తుంటాడు కూడా. అయితే పెళ్లినాటికి పట్టుచీర కొనడానికి కావాల్సిన మొత్తాన్ని సమకూర్చుకోలేకపోతాడు. సాదాసీదా నేత చీరతోనే 'అన్నం'ను అర్ధాంగిగా ఇంటికి తీసుకొస్తాడు. ఓ అవ్వ ఎగతాళిగా అదే అడుగుతుంది. జీవితంలో ఇది అతని తొలి 'వైఫల్యం'. తర్వాత తండ్రి చనిపోయినప్పుడు శవం మీద కప్పడానికి పట్టుబట్ట ఇమ్మని అడుగుతాడు పురోహితుడు. బొడ్లోంచి పట్టు నూలు పోగు తీసిస్తాడు వేంగడం. బొటనవేళ్లను ఆ పట్టుదారంతోనే కలిపి ముడివేస్తారు. "ఇతను జీవితాంతం ఎన్నో పట్టు చీరలు నేశాడు. అయితేనేం! చనిపోయేనాటికి కప్పడానికి పట్టు పీలికకు కూడా నోచుకోలేదు కదా. ఇదే నేత కార్మికుడి దైన్యస్థితి" అంటారు ఆ కార్యక్రమానికి హాజరైనవారొకరు. ఇది వేంగడంకే కాదు. అక్కడి వారందరి మనసులను బాధిస్తుంది. వేంగడం ఓసారి దొరవారి కుమార్తె పెళ్లి పట్టుచీర నేసిస్తాడు. సముద్రపు అలలు, అరణ్యం కలగలిసిన ఆ పట్టుచీర అందరి మన్ననలను పొందుతుంది. అయితే ఆ అద్భుతమైన పట్టుచీరను ఒక్కసారైనా కళ్లారా చూస్తానంటుంది అతని భార్య అన్నం. అందుకోసం పలు ప్రయాసలకోర్చి నడుచుకుంటూ పెళ్లి జరిగే చోటికి వెళతారు. తమ చేతులతో ఎంతో కష్టపడి నేసిన పట్టుచీరను కంటితో చూడ్డానికి కూడా ఎంత కష్టపడాలనే విషయాన్ని ఈ దృశ్యం ద్వారా దర్శకుడు ప్రేక్షకులకు తెలియచేస్తాడు.

పాప పుట్టినప్పుడు తొలిసారిగా చెవిలో ఏదైనా మంచి మాట చెప్పమంటాడు పురోహితుడు. పెళ్లినాటికి పట్టుచీర కొనిస్తానని చెప్తాడు వెంగడం. అతనలా చెప్పడాన్ని బంధుమిత్రులు విమర్శిస్తారు. నెరవేర్చలేని మాట ఇస్తే శాపం తగులుతుందని కూడా అంటారు. తన బిడ్డకిచ్చిన మాటను ఎంత కష్టపడైనా నిలబెట్టుకుంటానంటాడు. ఈ విషయమై అతని భార్య కూడా డీలా పడుతుంది. భార్యకు పట్టుచీర కొనివ్వడం కోసం కూడబెట్టిన డబ్బును చూపించి "పట్టుచీరకు కావాల్సిన సగం డబ్బును మాత్రమే నేనిప్పటి వరకు పోగు చేశాను. మిగతా సగం ఇకమీదట జమ చేస్తాను" అంటాడు. ఆ తర్వాతే ఆమె కుదుటపడుతుంది. అయితే అతని చెల్లెలి కాపురం నిలబెట్టడం కోసం ఆ డబ్బును ఆమెకు ఇవ్వాల్సి వస్తుంది. అది తన కుమార్తెకు పట్టుచీర కొనివ్వడం కోసం అట్టిపెట్టిన డబ్బని తెల్సి కూడా చెల్లెలి జీవితం ఎటువంటి ఆటుపోట్లకు గురికాకూడదనే ఇచ్చేస్తాడు. అయినప్పటికీ తన మాటను మాత్రం నిలబెట్టుకోవాలన్నదే అతని పట్టుదల. దానికోసం అతను దొంగగా మారతాడు. ప్రతి రోజు తను పనిచేసే చోటు





నుంచి కొద్దిగా పట్టునూలు తస్కరిస్తుంటాడు చాకచక్యంగా. పని పూర్తిచేసుకుని వెళ్లే కార్మికులు నూలేమైనా తీసుకెళ్తున్నారేమోనని వెతికి మరీ పంపుతారు దొర మనుషులు. అలా కూడా పట్టుపడని విధంగా కొద్దిగా పట్టు నూలును వుండచుట్టుకుని నోట్లో కుక్కుకుని బయటికి వస్తుంటాడు. ఆ విధంగా పోగు చేసిన నూలుతో పట్టుచీర నేయనారంభిస్తాడు. అందుకవసరమైన మగ్గాన్ని పశువుల కొష్టంలో ఏర్పాటుచేస్తాడు. తర్వాత జబ్బుచేసి భార్య చనిపోతుంది. అప్పుడు అన్నీ తానే అయి బిడ్డను సాకుతుంటాడు. ఆమె మనసుకు నచ్చిన, ఆమె చిననాటి స్నేహితుడితోనే వివాహం నిశ్చయిస్తాడు. అయితే అప్పటికే అతని జీవితంలో చాలా కీలకమైన సంఘటనలు జరిగిపోతాయి. తమ ఊరికి వచ్చి తమలో చైతన్యాన్ని, తెగువను నింపిన కమ్యూనిస్టు నాయకుడు పోలీసుల తూటాలకు బలైన పరిస్థితుల్లో ఆ బాధ్యతను వేంగడం తీసుకోవాల్సివస్తుంది. చేనేత కార్మిక.సంఘ నాయకుడిగా వారి బాగుకోసం, వారి దైనందిన వేతన పెంపుకోసం పాటుపడే అతను ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంటాడు. వేతనాల పెంపుకోసం వారు చేస్తున్న సమ్మెను కొనసాగించకూడదంటాడు. కారణం కుమార్తె పెళ్లి ముహూర్తం కొద్దిరోజుల్లోనే పెట్టుకుంటారు. ఆలోపు పట్టుచీరను పూర్తి చేయాలి. సమ్మె పొడిగిస్తే ఆ పనికి ఆటంకమౌతుంది. అందుకే కొంతమంది కార్మికులతో కలిసి పనిలోకెళతాడు వేంగడం. అప్పుడు అతని సహచరుడు సారథి కార్మిక సంఘ బాధ్యతలు తీసుకుంటాడు. పట్టునూలు దొంగతనం చేశాడన్న కారణంగా పోలీసులు అతన్ని అరెస్టు చేస్తారు. అప్పుడు వేంగడం కుమార్తె ఆలనాపాలనా చూడడానికి అతని చెల్లెలు, ఆమె భర్త నిరాకరించడంతో బాధలు పడలేక ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకోబోతుంది. ప్రాణాలు పోవుకానీ పక్షవాతం వచ్చి మంచాన పడుతుంది. ఇదంతా ఫ్లాష్‌బ్యాక్‌లో ముక్కలు ముక్కలుగా మనకు తెలుస్తుంది. పెరోల్ మీద వచ్చిన వేంగడం ఆ పరిస్థితుల్లో తన కుమార్తెను చూచి చలించిపోతాడు. విషాహారం పెడతాడు. అయితే పశువుల కొష్టంలో ఆమె కోసం నేస్తున్న చీరను చివరి క్షణాల్లో చూపించి “ఈ పట్టుచీర చూడు. నీకోసం గత పదహారు సంవత్సరాలుగా నేస్తున్నాను. ఇది కట్టుకున్న నీవు ఎంత అందంగా వుంటావోనని ప్రతి రోజు అనుకుంటుంటాను. దానికోసమే దొంగనయ్యాను. విశ్వాసఘాతకుడ్నయ్యాను. అంతా దీనికోసమే... కేవలం దీనికోసమే...” అంటాడు. ఆ తర్వాత కుమార్తె ప్రాణాలు విడుస్తుంది. అప్పుడు ఆమె శవం మీద సగం నేసిన పట్టుచీరను కప్పడంతో చిత్రం ముగుస్తుంది.



కె.ఎస్.పార్థసారథి

చిత్రం ఆద్యంతం మరీ ముఖ్యంగా చివరి సన్నివేశాల్లో ప్రకాష్ రాజ్ కనబరిచిన నటనకు హేట్సాఫ్. అత్యంత సహజంగా, పాత్రకు ప్రాణం పోశాడనే అనుకోవాలి. అదే కాదు! సినిమాలో క్లోజప్‌లో వచ్చిన ప్రతి సంఘటనలోనూ ప్రకాష్‌రాజ్ చక్కగా చేశాడు. యువకుడిగా, వివాహితుడిగా, తండ్రిగా, కార్మిక నాయకుడిగా,

నడి వయస్కుడిగా వృద్ధుడిగా ప్రకాష్ రాజ్ కనబరిచిన నటన వర్ణనాతీతం. తెరమీద చూచి తరించవలసిందే.

కాకతాళీయం కాదేమో!

అయితే విమర్శకుల కళ్లలోంచి ఓ విషయం మాత్రం తప్పించుకోలేకపోయింది. ఓ కార్మిక సంఘ నాయకుడు తన వ్యక్తిగత ప్రయోజనంకోసం ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నించినట్టు చూపడాన్ని వారు ఆమోదించలేకపోయారు. అయితే అదే సమయంలో వేంగడం అనుచరుడు సారథి ఆ బాధ్యతను తీసుకోవడం కాకతాళీయం కాదు. కావాలనే అలా కథ నడిపించారని వారి భావన. ఎందుకంటే కె.ఎస్.పార్థసారథి తమిళనాట పేరుగాంచిన ట్రేడ్ యూనియన్ నాయకుడు. అతన్ని కామ్రేడ్లు కెఎస్‌పి అని పిలిచేవారు. నేత కార్మికులను సహకార ఉద్యమంలోకి తీసుకురావడంలో ఆయన చక్కటి పాత్ర పోషించాడు. కెఎస్పీ స్ఫూర్తితోనే కంజీవరం



ప్రియదర్శన్

చిత్రంలోని వేంగడం సహచరునికి సారథి అన్న పేరు పెట్టి వుంటారని, వేంగడం అనంతర ఉద్యమ బాధ్యతలను అందుకే అతనికి అప్పగించి వుంటారన్నది విమర్శకుల ఆలోచన. ట్రేడ్ యూనియన్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన కెఎస్పీ శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ‘కంజీవరం’ ప్రధాన పాత్రధారి ప్రకాష్ రాజ్‌కు ఉత్తమ జాతీయ నటుడి అవార్డు రావడమంటే ఈ రూపంలో కెయస్పీకి నివాళులు తెల్పినట్టుగా వారు భావిస్తున్నారు.

సునిశిత హాస్యం

ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు అవార్డులను గెల్చుకున్న గొప్ప చిత్రం ‘కంజీవరం’. అంత మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించిన ఘనత దర్శకుడు ప్రియదర్శన్‌కే చెందుతుంది. ‘హేరా ఫేరి, హంగామా’ వంటి కమర్షియల్, కామెడీ చిత్రాల ద్వారా పేరొందిన దర్శక, నిర్మాత ప్రియదర్శన్ ‘కంజీవరం’ వంటి ఆర్ట్ చిత్రాన్ని తెరకెక్కించడమంటే చిన్న విషయం కాదు. అది ఆయనలోని బహుముఖ ప్రతిభకు నిదర్శనం. ఆదూర్ గోపాలకృష్ణన్ వంటి గొప్ప దర్శకులతో పోటీ పడి జాతీయ అవార్డు దక్కించుకోవాలంటే ఎంతో కృషి వుండాలి. కష్టం వుండాలి. ప్రియదర్శన్ పడ్డ కష్టం ‘కంజీవరం’లోని ప్రతి ఫ్రేమ్‌లోనూ పూదండలో దారంలా కనిపిస్తూనే వుంటుంది. ఆ కష్టానికి తగ్గ ఫలితం జాతీయ అవార్డు, విమర్శకుల ప్రశంసల రూపంలో అతనికి అందిందనుకోండి. చిత్రాన్ని ఎంతో బరువైన దృశ్యాలతో, ఎక్కడా బిగి తగ్గకుండా తెరకెక్కించాడని విమర్శకులు కితాబులిచ్చారు. ఇదే సమయంలో తనకెంతో ఇష్టమైన హాస్యాన్ని ఆయన విస్మరించలేదు. బరువుగా నడిచే చిత్రమైనప్పటికీ తనదైన శైలిలో సున్నిత హాస్యాన్ని అద్దారు. చిత్రంలో తారసపడే అలాంటి సంఘటనలు ఒకటి రెండు తప్పకుండా

చెప్పుకోవాల్సిందే.

వేంగడం (ప్రకాష్ రాజ్) పెరోల్ మీద బస్సులో స్వగ్రామానికి బయలుదేరతాడు. చాలా సేపటి తర్వాత బస్సు ఆపి

"టీ కావాలంటే దిగి తాగండి. ఆ తర్వాత బస్సు ఎక్కడా ఆగదు" అంటాడు కండక్టర్.

దానికి ప్యాసింజర్లు "బస్సు ఆగకపోతే దిగేది ఎట్టాగంట" అనుకుని నవ్వుకుంటారు.

అలాగే ... వేంగడం కాస్త మతిమరుపు మనిషి. ప్రతిరోజూ బయటికి వెళ్లేటప్పుడు తన కళ్లజోడు, సైకిల్ తాళం వెతుక్కుంటుంటాడు. స్నానానికి వెళ్లేటప్పుడు కండవా తీసుకెళ్లడం కూడా మర్చిపోతుంటాడు. ఇదే విషయాన్ని అతని భార్య సున్నితంగా తన కుమార్తెతో ఇలా ప్రస్తావిస్తుంది.

"మీనాన్న తల శరీరానికి అతుక్కుని వుంది కాబట్టి సరిపోయింది. లేకపోతే అది లేకుండానే ఇంటికి వచ్చేస్తాడు" అని.

మరో సందర్భంలో దొరవారి కుమార్తె కోసం వేంగడం నేసిన పట్టుచీరను చూడాలంటుంది అన్నం (శ్రేయా రెడ్డి). తన కోరిక తీరాలంటే దొరవారింటికి వెళ్లాల్సిందేనంటాడతను. పెళ్లికుమార్తె కట్టుకున్న పట్టుచీర చూడ్డానికి ఇద్దరూ కల్సి బయలుదేరతారు. అయితే అంత దూరం నడవలేని అన్నం ఆయాసం తీర్చుకోవడానికి కాసేపు ఆగుదామంటుంది. తీరిగ్గా నడుచుకుంటూ వెళ్తే నూతన వధూవరులు వెళ్లిపోతారేమోనని అతను తన భార్యను భుజాన వేసుకుని పరిగెడుతుంటాడు. ఈ సందర్భంగా జరిగే సంభాషణ కూడా నవ్వులు పూయిస్తుంది.

ఇలాంటి హాస్యభరిత సంఘటనలు, సంభాషణలు ... అంత భారంగా నడిచే చిత్రంలో సైతం అడపాదడపా ప్రేక్షకుల మనసును రంజింపచేస్తాయి. దర్శకుడు ప్రియదర్శన్ హాస్యప్రియత్వానికివే నిదర్శనలు.

★

ప్రకాష్ (రాజ్) రాయ్



ప్రకాష్ రాజ్! పేరు చెప్తే చాలు. అతను పోషించిన ఎన్నో పాత్రలు మన కళ్లముందు కదలాడతాయి. ఆయా పాత్రల రూపంలో అతను చెప్పిన ఎన్నో డైలాగులు అక్షరం పొల్లు పోకుండా గుర్తొస్తాయి. సహజసిద్ధమైన అతని నటనే అందుకు కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎంతటి క్లిష్టమైన సన్నివేశాన్నైనా ... ఐదు భాషల్లో సింగిల్ టేక్‌లో ఓకే చేయగల సమర్థుడికి మరి ఆ మాత్రం గుర్తింపు వుండదూ! అమాయకుడిగా, శాడిస్టు తండ్రిగా, మంచి తండ్రిగా, ఉన్మాదిగా, ప్రతి నాయకుడిగా, ఫ్యాక్షనిస్టుగా వైవిధ్యభరితమైన పాత్రలు చేసి ప్రేక్షకుల మెప్పును రాశులకొద్దీ పొందిన ఘనత ప్రకాష్‌రాజ్ సొంతం. అయితే చంద్రునికో మచ్చలా ప్రకాష్‌రాజ్ మీద విమర్శలూ వున్నాయి. ఎన్నో మార్లు చిత్ర పరిశ్రమచేత నిషేధాలను ఎదుర్కొన్నాడు. అలా అన్నిసార్లు బహిష్కరణ వేటుకు గురై తిరిగి నిలదొక్కుకోవడం, నిరూపించుకోవడం ఆయనకున్న తిరుగులేని స్థానాన్ని తెలుపుతుంది. అందుకు ఎంతో ప్రతిభ వుండాలి. అది ప్రకాష్‌రాజ్‌లో పుష్కలంగా వుంది కాబట్టే వాటన్నిటినీ అధిగమించి ఇవాళ జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని సైతం సొంతం చేసుకున్నాడు. ఇది అతనికి లభించిన మూడవ జాతీయ పురస్కారం. తొలిసారి 1998లో ఇరువర్ (ఇద్దరు) చిత్రంలో చేసిన నటనకు గాను ఉత్తమ సహాయ నటుడు అవార్డును, 2003లో స్పెషల్ జూరీ అవార్డును గెల్చుకున్నాడు. అయితే ఈ దఫా (2007) ఏకంగా బాలీవుడ్ హీరోలు అమీర్ ఖాన్, షారుఖ్‌ఖాన్ తో పోటీ పడి మరీ ఉత్తమ నటుడి అవార్డునే దక్కించుకోవడం అభినందనీయం.

ఇన్ని విషయాలు చెప్పకుంటున్నప్పటికీ ప్రకాష్ రాజ్ వ్యక్తిగత జీవిత విశేషాలు తెల్సుకోవాలని ఎవరికి మాత్రం వుండదు. ఆ విశేషాలు కూడా చెప్పేసుకుందాం. కర్ణాటక రాష్ట్రం, మంగుళూరులో జన్మించిన ప్రకాష్ రాజ్ అసలు పేరు ప్రకాష్ రాయ్. తల్లి క్రిస్టియన్. తండ్రి మంగుళూరుకు చెందిన వ్యవసాయదారుడు. వీరిది ప్రేమ వివాహం. చిన్నతనంలో అతనికి చదువుమీద పెద్దగా దృష్టి వుండేది కాదు. చెల్లి, తమ్ముడు మాత్రం చదువులో ముందుండేవారు. బహుమతులు గెల్చుకునేవారు. ఓసారి ప్రకాష్ తండ్రి "నువ్వు కూడా ఎందులోనైనా ప్రైజ్ తెచ్చుకోవచ్చుకదా" అంటే ఎంతో పట్టుదలతో డిబేట్ కాంపిటీషన్‌లో పాల్గొని ప్రైజ్ కొట్టేస్తాడు. దానితో పాటు మోగిన చప్పట్లు అతనికి అలా గుర్తుండిపోతాయి. ఆ చప్పట్ల కోసమే అతను ఎన్నోసార్లు వేదికలెక్కాడు. పియుసి చదువుతున్నప్పుడు ఓ నాటకం రిహార్సల్స్ ఎగ్గొట్టాడు. దాంతో ఆ పాత్రలో మరొకర్ని ఎంపిక చేసుకుంటారు నిర్వాహకులు. తను లేకపోతే నాటకం రక్తికట్టదంటాడు. అతనన్నట్టుగానే అది తేలిపోతుంది. దానికతను ఎంతో సంతోషిస్తాడు. అయితే ఒక లెక్చరర్ మాత్రం అతనిని పిల్చి "నువ్వు లేకపోయినా మేం నాటకాలు వేయడం మానం. వేస్తూనే వుంటాం. కాకపోతే నువ్వు మంచి నటుడివి. నీకే నష్టం" అంటాడు. అప్పటికది అర్థంకాకపోయినా తర్వాత అతనిలో అంతర్మథనం మొదలౌతుంది. కాలేజీ ఎగ్గొట్టి మరీ కళాక్షేత్ర అనే డ్రామా కంపెనీకి వెళ్లడం మొదలెడతాడు. అక్కడే అతనికి పేరుపొందిన నటులు పరిచయమౌతారు. సాహిత్యం పట్ల ఆసక్తి పెరుగుతుంది. మెల్లగా నాటకాల ప్రాముఖ్యత తగ్గుముఖం పట్టడంతో దూరదర్శన్‌లో రిహార్సల్స్ అసిస్టెంట్‌గా...ఎడిటర్‌గా పనిచేశాడు. అనుకోకుండా ఓసారి తెరమీద కూడా కనిపించే అవకాశం వచ్చింది. ఆ సీరియల్‌లో అతని పాత్రకు మంచి పేరు కూడా వచ్చింది. మెల్లగా నటన పట్ల ఆసక్తి కనబరిచాడు. ఓ ఆర్ట్ ఫిల్మ్‌లో కూడా నటించేశాడు. అక్కడే హీరోయిన్ గీతతో పరిచయమేర్పడుతుంది. ఎందరో గొప్ప గొప్పల నటులను వెండితెరకు పరిచయం చేసిన బాలచందర్ పరిచయం ఆమె వల్లే కలుగుతుంది. ప్రకాష్ రాయ్ పేరును ప్రకాష్ రాజ్‌గా మార్చింది ఆయనే. బాలచందర్ దర్శకత్వంలో 'డ్యూయట్' చిత్రంలో నటించాడు ప్రకాష్‌రాజ్. తెలుగులో తొలిచిత్రం 'సంకల్పం'. గొంతు బాలేదని ఆ చిత్రంలో అతనికి మరొకరితో డబ్బింగ్ చెప్పించారు. అది అంతగా నచ్చని ప్రకాష్‌రాజ్ ఎంతో కష్టపడి తన పాత్రకు తనే డబ్బింగ్ చెప్పి ప్రేక్షకులను మెప్పించే స్థాయికి చేరుకున్నాడు. మచ్చుకు చెప్పాలంటే ఫ్యాక్షన్ లీడర్‌గా 'అంత:పురం'లో, కొజ్జాగా 'మహారాణి'లో, మంచి తండ్రిగా 'బొమ్మరిల్లు, నువ్వు నాకు నచ్చావ్'లో అద్భుతమైన నటనను కనబరిచాడు. తాజాగా కంజీవరంలో ఓ కార్మిక నాయకుడిగా, కుమార్తెకు పట్టుచీర బహూకరించేందుకు చౌర్యానికి సైతం వెనుకాడని తండ్రిగా చక్కటి ప్రతిభను కనబరిచిన ప్రకాష్‌రాజ్‌ను జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపిక చేయడం జాతీయ ఏకాభిప్రాయమే!

★

ఇది విన్నారా?

సృష్టిలో జ్ఞానేంద్రియాలకు విశిష్టమైన స్థానం ఉంది. అవి కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం. వీటిలో ఏ అవయవం పనిచేయక పోయినా మానవుని జీవితం కష్టాలపాలవుతుంది. వీటిలో చెవి వినడానికి ఉపకరిస్తుంది. దీని వల్లే తిరిగి చెప్పగలుగుతాం. చెవులు తమ పనిని చేయలేకపోతే! వినలేం. పైగా దీని ప్రభావం మన మాట మీదా పడుతుంది. అందుకే వినికిడి సమస్యను అస్సలు నిర్లక్ష్యం చేయగూడదు. వినికిడి లోపం రావడానికి కారణాలేంటి? వాటిని ఎలా గుర్తించవచ్చు? వినికిడి సమస్యను ఎలా అధిగమించవచ్చు? చికిత్స ఏంటి? వంటి అంశాలను ఈ వారం తెలుసుకుందాం.

ముందుగా వినికిడిలోపం రావడానికి గల కారణాలను తెలుసుకుందాం.

తల్లి గర్భం ధరించిన సమయంలో సరైన పోషక ఆహారం తీసుకోకపోవడంవల్ల, వైద్యుల సలహా లేకుండా మందులు వాడడంవల్ల, మేనరికం వివాహాలు చేసుకోవడం వల్ల, ప్రసవసమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్ల పుట్టిన తరువాత శిశువుకు పచ్చ కామెర్లు, తీవ్రమైన జ్వరం, తలకు బలమైన గాయాలు తగలడం మొదలగు సమస్యలు వస్తాయి. వాటిని అలక్ష్యం చేయకుండా సంబంధిత వైద్యులను వెంటనే సంప్రదించాలి. లేకపోతే వినికిడి సమస్యలు వస్తాయి.

లోపాలను గుర్తించడం ఎలా?

వినికిడి లోపాలు కొన్ని పరీక్షల ద్వారా కనుగొనవచ్చు. ప్యూర్‌టోన్ ఆడియోమీటర్ ద్వారా వినికిడి శాతాన్ని కనుగొనవచ్చు. ఇంపిడెన్స్ ఆడియోమీటర్ ద్వారా చెవిలోని వ్యాధినీ, వినికిడి లోపాలకు గల కారణాలనూ కనుగొనవచ్చు.

బెరా పరీక్ష ద్వారా చిన్న పిల్లల్లోని వినికిడి శాతాన్ని కనుగొనవచ్చు. ఇలాంటి పరీక్షలు ఇంతకు మునుపు సిటీలకే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ఇ.అజయ్ కుమార్,
స్పీచ్ అండ్ హియరింగ్ స్పెషలిస్టు,
శ్రీ అనంతసాయి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్,
అనంతపురం.
ఫోన్ నెం 9849132351.

నిర్లక్ష్యం వద్దు

మన చెవిలో ముఖ్యంగా బాహ్య చెవి, మధ్య చెవి, అంతర్ చెవి అని మూడు బాగాలు ఉన్నాయి. బాహ్య చెవి, మధ్య చెవికి వచ్చే వ్యాధుల ద్వారా వినికిడి లోపం వస్తుంది. వీటిని అలక్ష్యం చేయకుండా సరైన సమయంలో వైద్యం తీసుకోవడం ద్వారా అంతర్ చెవికి వినికిడి లోపం రాకుండా ఆపవచ్చు. అంతర్ చెవిలోని కాక్లియర్(వినికిడినరం) బలహీన పడినప్పుడు వినికిడిలోపం వస్తుంది. దానికి వెంటనే వినికిడి పరికరం ఉపయోగించడం ద్వారా సమస్యను అదుపు చేయొచ్చు. ముఖ్యంగా చిన్నారులకు వినికిడిలోపం వస్తే మూగవారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల అలాంటి 6 సంవత్సరలలోపు పిల్లలకు కాక్లియర్ ఇంప్లాటిషన్ సర్జరీని ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్నారు. లేకపోతే వ్యాధి తీవ్రతను బట్టి వారికి చెవిటి మిషన్లను అమర్చవచ్చు. వాటిలో చెవి వెనుక, లోపల, ఫ్యాకెట్ మొదలైన అత్యధికమైన ప్రోగ్రామ్ బాల్ డిజిటల్ హియరింగ్ హెడ్స్ అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా 100డెసిబుల్స్ వరకూ వినొచ్చు. అంతకంటే ఎక్కువ శబ్దాల వల్ల వినికిడి సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. మొబైల్ ఫోన్లు, పెద్ద శబ్దాలతో మ్యూజిక్ వినడం, శబ్ద కాలుష్య ప్రాంతాల్లో పెద్ద పెద్ద శబ్దాలు వినడం ప్రమాదకరం.

చికిత్స

ప్యూర్‌టోన్ ఆడియోమీటర్ ద్వారా వినికిడి శాతం కనుగొనవచ్చు. వివిధ రకాల ఫ్రీక్వెన్సీల నుండి వివిధ రకాల డెసిబుల్స్ ద్వారా పేషెంటును పరీక్షించి వినికిడి తీవ్రతను కనుగొనవచ్చు. ప్రతి మనిషీ 0–20 డెసిబుల్స్ వరకు వినగలిగిన సామర్థ్యాన్ని సాధారణంగా నార్మల్‌స్థాయిగా గుర్తించవచ్చు. 20 డెసిబుల్స్ కంటే ఎక్కువగా ఉంటే వినికిడి తీవ్రత మనిషిలో తగ్గుతుంది. వినికిడి లోపం మరే ఇతర కారణాలు, వ్యాధుల వల్ల వస్తే మందుల ద్వారా చికిత్స పొందవచ్చు.

ఇంపిడెన్స్ ఆడియోమీటర్ ద్వారా బాహ్య, మధ్య చెవిలోని వ్యాధులను గుర్తించవచ్చు. ఈ పరీక్ష ద్వారా చెవిలోకి ప్రత్యక్షంగా స్కోప్‌ను పెట్టి ప్రెజర్ చేయడం వల్ల వ్యాధి నిర్ధారణ, తీవ్రతను గుర్తించవచ్చు. ఇలా గుర్తించిన వ్యాధులను మందుల ద్వారా నయం చేయొచ్చు.

బెరా అనే పరీక్ష ద్వారా చిన్నపిల్లల్లో వినికిడి సమస్యలను, వ్యాధులను క్షుణ్ణంగా గుర్తించగలం. ఎలాంటి వినికిడి సమస్యలైనా మందులతో నయం కానప్పుడు తీవ్రతను బట్టి తప్పనిసరిగా హియరింగ్ ఎయిడ్‌లు(చెవిటి మిషన్లు) వాడవలసి ఉంటుంది. మార్కెట్లో రకరకాల కంపెనీల అడ్వాన్స్‌డ్ హియరింగ్ ఎయిడ్‌లు అందుబాటులో ఉన్నాయి.

★

క్రైమ్ కథ

అనుమానం

- యర్నాగుల సుధాకరరావు

"సార్! నాకెందుకో అనుమానంగా ఉంది.నేను ఒకింటిని అద్దెకి చ్చాను. అందులో రాజు అనే ముప్పయ్ ఏళ్లవాడు దిగాడు. ఏపని చేయడు. వారంలో మూడునాలుగురోజులు ఉండడు. ఠంచన్‌గా నెలసరి నాకు అద్దె చెల్లించేస్తాడు.అతడిలో ఏదో తేడా ఉంది" చెప్పాడు వల్లభ్.

ఇన్‌స్పెక్టర్ ఆసక్తిగా చూశాడు. "ఎవడో పట్టణ సరిహద్దు కాలనీలో ఉన్న నీఇంటిలో అద్దెకున్నాడు.వాడిని అనుమానించావు.నీవు చెప్పిన ప్రకారం అయితే వాడు తేడా మనిషే. నో డవుట్ " చెప్పి పంపేసాడు.

రాజుమీద పోలీస్ నిఘా వేయబడింది.రాత్రి పదయ్యాక రాజు ఇంటికి తాళం వేసి బయల్దేరాడు. ఆటో ఎక్కి ఒక వీధి ముందు దిగాడు. చినుకులు పడుతున్నాయి. ఒకింటిని పరిశీలనగా చూసి చేతిలో ఇనుప రాడ్‌తో వేసిన తాళం బద్దలు కొడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ ఎక్కించుకుని ఠాణాకు తీసుకుపోయారు.

రాజు సన్నగా వణికాడు. పోలీసులు అడగకుండానే తాను దొంగనని ఒప్పేసుకున్నాడు. అంతేకాక "కడుపు జరగక చేస్తున్నాను. ఒకసారి దొంగతనం చేసాక దోచుకున్న దాంతో కొన్నాళ్లు హాయిగా జీవిస్తాను.మళ్లీ డబ్బు అవసరపడినపుడు వెదుతుంటా" అని చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ అయోమయంగా చూశాడు."ఏరా! నిన్ను అడగకుండానే చెప్పేస్తున్నావు. నువ్వు దొంగవయితే ఇలా ఆరుమాసాలుగా ఇల్లు అద్దెకు తీసుకుని ఒకచోట ఉండనే ఉండవు.ఈపట్టణంలో మకాం వేశావంటే నీలో ఇంకేదో దాగిఉంది. అది చెప్పురా! నేను అడిగినవెంటనే నీవు చేప్పేశావనుకో నేను కూర్చున్న సీటులోంచి లేవనే లేవను. లేస్తే మొన్నా మధ్య ఒక లాకప్‌డెత్ చేసాను.ఆకేసు ఒకటి నామెడకు చుట్టుకుని ఉంది. అంతగా నాకోపం నాకు శత్రువైంది" చెప్పి లాఠీ ఊపాడు.

"నన్ను నమ్మండి. నేను దొంగను అంతకు మించి నాలో ఏమీలేదు"

"చూడూ!నిన్నిలా బతిమాడాల్సిందిలేదు" ఇన్‌స్పెక్టర్ గొంతు కటువుగా మారిపోయింది.

"సార్ నిజం చెబుతాను. నేను నా భార్యబిడ్డలను సాదలేక వదిలేశాను.నేను తప్పిపోయానని వెదికిపెట్టమని పోలీసు కేసు పెట్టింది నాభార్య. అందుకే ఇక్కడికి వచ్చి

తలదాచుకున్నాను. అంతకుతప్పితే నాలో నేరం లేదు. ఇక్కడ ఏపని దొరకలేదు.అందుకే దొంగయ్యాను."

"చెప్పింది నమ్మకంగా ఉన్నా నీవు ఇక్కడేదో కష్టపడి బతకాలి. కానీ బాగా అలవాటున్న వాడిలానే ఇలా దొంగతనాలు చేస్తున్నావు.పగలు ఏ ఇల్లు తాళం వేసుందో వెతికి వచ్చి రాత్రివేళ ఆ ఇంట్లో దిగిపోతున్నావు. నీవు ఇంకా నిజాన్ని చెప్పడంలేదు. సరే నీకు చావగొట్టి చెప్పించగలను. ఒకరోజు వాయిదా వేస్తున్నాను. నీఫోటో తీసి నెట్‌లో అన్ని ఠాణాకేంద్రాలకు పంపుతాను. నీవు ఎవరైంది తెలిసిపోతుంది. ఉదయాన్నే వస్తాను. అప్పుడు నిజం చెప్పాలంటే చెప్పేయ్" లాఠీతో భుజంతట్టి ఇన్‌స్పెక్టర్ ఫోటోలుతీసి నెట్‌లో పెట్టమని సిబ్బందికి చెప్పి వెళ్లిపోయాడు.

సెల్‌లో రాజు బిక్కుబిక్కుమని ఒకమూల కూర్చున్నాడు.తను ఎవరైంది తెలిసిపోతుంది.అప్పుడు ఇలా తనను సంకెళ్లు లేకుండా కూర్చుండబెట్టరు. తాను చేసిన నేరాలు అంతఘోరమైనవి. తల పట్టుకుని గోడకు చేరగిలబడ్డాడు.

ఉదయాన్నే ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. "ఏరా రాజు! నిజం చెబుతావా? లేకుంటే నెట్ ఓపెన్ చేసి చూడనా?"

"సార్ చెబుతాను. నేను ఒక హంతకుణ్ణి. జంటహత్యలు చేశాను. పోలీసులు పట్టుకుని కోర్టులో పెట్టారు. నన్ను రిమాండుకు పంపారు. సబ్ జైలుకు నన్ను తరలిస్తున్న వ్యాన్ లక్కీగా రిపేర్ వచ్చింది. నేను వెంటనే తప్పించుకునేందుకు నా ఆదుర్దాలో నేనున్నాను. పోలీసులు ఎవరినో రప్పించి బాగు చేయించే పనిలోఉన్నారు.వ్యాన్ లోంచి మెల్లగా దిగిపోయి వారు ఏమరిపాటును చూసి అలానే పారిపోయాను. కన్పించిన ట్రయిన్ ఎక్కేసి ఇక్కడికి చేరాను. బతకడానికి కష్టపడి పనిచేస్తే కడుపు నిండినా రోడ్డుమీద పడుకోవాలి. అందుకే ఇక్కడ దొంగతనాలు చేశాను"

ఠాణాలో సిబ్బంది ఎవరి పనుల్లో వారున్నారు.రాజు కథ చెప్పాక పనులు వదిలేసి చుట్టూ మూగారు.అతడివైపు అదోలా చూశారు. "ఎందుకు చేశావు హత్యలు?"

"నా తమ్ముడు దుర్మార్గుడే. వాడిని మాపల్లెలో చెట్టుకు కట్టేసి ఇద్దరు చావగొట్టారు. ఆదెబ్బలకు చచ్చిపోయాడు. ఊరంతా చంపినవాళ్లకు సపోర్టుగా నిలిచారు. పోలీసులు వచ్చి అడిగితే ఎవరూ సాక్ష్యం చెప్పలేదు. పైగా నాతమ్ముడిపై అనేక కేసులు ఉన్నందున పోలీసులు కూడా కేసు దర్యాప్తులో ఉంది అని చెప్పి కాలాయాపన చేశారు. నేను కడుపునొప్పితో ఆసుపత్రిలో నెలరోజులు ఉన్నాను. అటునుంచి వచ్చాక పోలీసులను కలిసి చంపిన ఇద్దరి పేర్లు చెప్పి అరెస్టుచేయమన్నాను. పోలీసులు పదిమార్లు తిప్పించుకున్నారు తప్పితే నాకు న్యాయం చేయలేదు. మాపల్లెవాసులూ నామీద దాడులు చేయడానికి చూడడమే కాకుండా నన్ను ఊరు వదిలిపొమ్మన్నారు. అందుకు రచ్చబండ వద్దకు నన్నుపిలిచి ఊరి నుంచి బహిష్కరించారు.ఇక ఉపేక్షించదలచుకోలేదు. నాతమ్ముడిని చంపిన ఆహంతకులపై ఎలాంటి కేసులు లేకపోవడం వారు నన్ను రెచ్చగొట్టేలా నాకళ్లముందే తిరుగాడడం తట్టుకోలేకపోయాను. కత్తితో కండగా వెంటాడి మరీ మాగ్రామస్తుల సాక్షిగా నరికేశాను.అలా నేను హంతకుడనయ్యాను. ఇది నాకథ"

పోలీసులు వెంటనే గొలుసులు తగిలించేశారు.రెండు అడుగులు వెనక్కివేసి నిలబడ్డారు. రాజు కళ్లలో ఎర్రటి జీరలు చూడలేకపోయారు. ఇన్‌స్పెక్టర్ అప్పుడు నెట్‌ద్వారా రాజు చెప్పిన పోలీస్‌ఠాణాకు పంపాడు. వెంటనే రిప్లయ్ వచ్చింది "రాజుకోసం వేయికళ్లతో దర్యాప్తు చేస్తున్నాం.వాడిని తీసుకుపోవడానికి ఇప్పుడే బయల్దేరుతున్నాం" అని మెసేజ్ వచ్చింది.

ఇన్‌స్పెక్టర్ రాజును చూసి "నీవు నీతమ్ముడులాంటివాడివే. ప్రజాకంటకుడవే. నీకోసం పోలీసులు వస్తారు. అప్పుడు తెలుస్తుంది. మీఇద్దరన్న దమ్ములవలన పాపం ఆగ్రామీణులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో " చెప్పి సెల్‌లోకి నెట్టేశాడు.

★

ప్రారంభోత్సవం

- రంగనాథ రామచంద్రరావు

ఆ ఊరు కొత్త పెళ్ళికూతురిలా కళకళలాడుతోంది. దారి పొడుగునా రోడ్డుకు ఇరువైపులా పాతిన బొంగులకు కట్టిన రంగు రంగుల జెండాలు గాలికి రెపరెపలాడుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనాలు హుషారుగా ఉన్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న పెద్ద హోర్డింగ్ మీద ఆ రోజు విచ్చేయబోతున్న మంత్రిగారి ఫొటో రంగురంగులలో మెరిసిపోతూ ఉంది.

రాబోయే మంత్రిగారిపై పుష్పవర్షాన్ని కురిపించడానికి రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన పాఠశాల విద్యార్థులు చేతుల్లో పువ్వులు పట్టుకుని సిద్ధంగా ఉన్నారు.

చూస్తుండగానే మంత్రిగారి పైలెట్ వెహికల్స్ సైరన్ మోగిస్తూ దూసుకొచ్చాయి.

ఆ వెనుకే టాపులేని జీపులో వస్తున్న మంత్రిగారు నుంచొని రెండు చేతులూ జోడించి నవ్వుతూ కనిపించారు. రోడ్డుకు ఇరువైపులా నుంచున్న ప్రజలు నినాదాలు చేయసాగారు. బారులు తీరిన బాలబాలికలు మంత్రిగారి మీద పుష్పవర్షం కురిపించసాగారు. అడుగడుగునా అభిమానులూ, చోటామోటా నాయకులూ మంత్రిగారి వాహనాన్ని ఆపి మెడ కూడా కనిపించని మంత్రిగారి మెళ్ళో దండలు వేసి దండాలు పెట్టారు. మంత్రిగారు నవ్వుతూ ఆ దండల్ని మెళ్ళో నుంచి తీసి దారికిరువైపులా నుంచున్న ప్రజల మీదికి ఉత్సాహంగా విసిరేయసాగారు. మంత్రిగారు విసిరేసిన దండల కోసం అక్కడి జనం మితిమీరిన అభిమానంతో కుమ్ములాడుకోసాగారు.

అయితే ఇదేమీ పట్టని మంత్రిగారి జీపు నెమ్మదిగా ముందుకు కదలసాగింది.

మంత్రిగారి జీపు కాలేజీరోడ్డు దాటి టర్న్ తిరిగి, పెట్రోల్ బంకులు దాటి, మున్సిపల్‌రోడ్డు దాటి బ్రిడ్జి మీదుగా ప్రయాణిస్తూ చివరికి సభా వేదిక దగ్గరికి వచ్చి ఆగింది.

మెయిన్ రోడ్డుకు పక్కనే సభా వేదిక అట్టహాసంగా అలంకరించి ఉంది.

> కారు నెమ్మదిగా గెస్ట్‌హౌస్‌వైపు కదిలింది. గెస్ట్‌హౌస్ చేరగానే కారు దిగిన మంత్రిగారిని అక్కడ ఉన్న జనాలు చుట్టుముట్టారు. ఏవేవో సమస్యలు ఏకరవు పెట్టారు. అర్జీలు ఇచ్చారు. అందరి సమస్యలూ తీరుస్తానని వాగ్దానం చేసి ఓ పెద్ద నమస్కారం పెట్టి లోపలికి దారి తీశాడు.

జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి దారి చూపుతుండగా మంత్రిగారు వందిమాగధులతో వేదిక వైపు కదిలారు. గన్‌మెన్స్ మంత్రిగారి చుట్టూ రక్షణ కోసం వలయంగా ఏర్పడి వారిని సురక్షితంగా వేదిక మీదికి తీసుకెళ్ళారు.

రిసెప్షన్‌లో పెళ్ళికొడుకునూ, పెళ్ళికూతురునూ కూర్చోపెట్టడానికి ఉపయోగించే సింహాసనంలాంటి కుర్చీ దగ్గరకి మంత్రిగారిని తీసుకెళ్ళారు. ఆయన ప్రజలవైపు చూస్తూ, రెండు చేతులెత్తి నమస్కరిస్తూ కుర్చీలో కూర్చున్నారు. అంగరక్షకులు ఆయన వెనకే నుంచున్నారు. పి.ఎ ఏవో నాలుగు ఫైళ్ళు పట్టుకుని ఆయన వెనకే నుంచునున్నాడు.

వేదిక వెనక భాగంలో కట్టిన బ్యానర్ మీద "మంత్రిగారికి స్వాగతం! సుస్వాగతం!!" అనీ మరో బ్యానర్ మీద "దురాచార కోరల్లో నలిగిన బసివి స్త్రీల కోసం ప్రభుత్వం నిర్మించిన గృహాల ప్రారంభోత్సవం మరియు గృహ పట్టాల పంపిణీ", "ఆర్థిక ఆలంబనకోసం ఈ బసివి స్త్రీల కోసం నిర్మించిన వృత్తి విద్యాకేంద్రం ప్రారంభోత్సవం" అనీ రాసిన అక్షరాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. వేదిక మీద కూర్చున్న మంత్రిగారినీ, ఇతర ప్రముఖులనూ పూలమాలలతో సత్కరించాక కార్యక్రమ నిర్వాహకులు తమ స్వాగతోపన్యాసంలో–

"ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మన ప్రియతమ మంత్రిగారికి స్వాగతం! సుస్వాగతం!! ఈ రోజు నిజంగా శుభదినం. మంత్రిగారు ఎన్నో ముఖ్యమైన పనులున్నప్పటికీ వాటన్నిటినీ పక్కన పెట్టి మనకోసం ఈ కార్యక్రమానికి రావడం మన అదృష్టమనే చెప్పాలి. అసలు విషయానికొస్తే...

సమాజంలో అట్టడుగు వర్గాలో పుట్టి, అనాదిగా వస్తున్న దురాచారాల బంధనాల్లో చిక్కుకుని, కొందరు స్వార్థపరుల కుతంత్రాల కారణంగా బసివినులుగా మారి దుర్భర జీవితాలను వెళ్ళదీస్తున్నారు కొందరు మహిళలు. వారి పరిస్థితిని మన ప్రభుత్వం గుర్తించి ఆ దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దుచేసింది. అయితే మూఢ నమ్మకాల కరుకు కోరల్లో చిక్కుకుపోయిన అమాయకులు ఇంకా గుట్టుగా ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ దురాచారాన్ని సంపూర్ణంగా రూపుమాపడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతోంది. అలాంటి స్త్రీలను, వారి పిల్లలను ఆదుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం వారికి ఫించన్లు, గృహాలు, వృత్తివిద్యా కేంద్రాలు నెలకొల్పింది. ఈ రోజున ఈ స్త్రీల కోసం నిర్మించిన కాలనీ ప్రారంభోత్సవం మన ప్రియతమ మంత్రిగారి పవిత్ర హస్తాల మీదుగా జరగడం మన అదృష్టం. ఈ సందర్భంగా వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి సందేశాన్ని ప్రజలకు అందించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాను" అంటూ ఆహ్వానించారు.

సభ కరతాళ ధ్వనులతోనూ, నినాదాలతోనూ మారుమోగింది.

మంత్రిగారు నవ్వుతూ తమ ఆసనం నుంచి లేచారు. భారీ కాయాన్ని కదిలిస్తూ మైకు ముందుకు వచ్చి గొంతు సవరించుకున్నారు.

కరతాళ ధ్వనులతో, నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.

"సభా వేదిక మీదున్న ప్రముఖులకూ, వేదిక ముందున్న ప్రజాదేవుళ్ళకూ నా నమస్కారాలు. ఈ రోజు మిమ్మల్ని ఇలా కలుసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సాంఘీక

సంక్షేమ అధికారి నా దగ్గరికి వచ్చి ఇలా కార్యక్రమం పెట్టుకున్నాం. మీరు తప్పకుండా రావాలి అని అడిగినప్పుడు నేను కాదనలేకపోయాను. ఎందుకంటే నేను ఎంత మంత్రిని అయినా మీ మనిషినే. మీరు ఎన్నుకున్న నాయకుణ్ని కాబట్టి ముఖ్యమైన పనులు ఎన్ని ఉన్నప్పటికీ అవి మీ కంటే ఎక్కువ కాదని ఇలా వచ్చాను" మంత్రిగారు ఓ క్షణం ఆగి మళ్ళీ తమ ఉపన్యాసం కొనసాగించారు. "ఈ రోజు ఇక్కడ జరుగుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మతంతోనూ, మత విశ్వాసాలతోనూ, మూఢ నమ్మకాలతోనూ బతుకు బండిని లాగుతున్న మనిషి, సమాజంలో నెలకొన్న మూఢ విశ్వాసాలకు తలవొంచుతాడు. అలాంటి ఓ మూఢ విశ్వాసానికి బలైన ఈ అభాగ్య స్త్రీలను చూస్తుంటే నా హృదయం కరిగిపోతోంది. ఈ దీన స్త్రీల ఆర్తనాదాలు, రోదనలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఉన్నత వర్గాల్లో లేని ఈ దురాచారాన్ని కాలం మారుతున్నా కొందరు స్వార్థపరులు అలాగే బతికించుకుంటూ వస్తున్నారు. ఈ దురాచారం కారణంగా అట్టడుగు వర్గాల్లో పుట్టిన కొందరు స్త్రీలను ఆచారం పేరిట బసివినులుగా మారుస్తున్నారు. భోగ వస్తువుగా మారిన ఈ స్త్రీలను ఎవరైనా ఆశించవచ్చు. కేవలం కోరికలు తీర్చే యంత్రాలుగా మారిన ఈ స్త్రీలకు పుట్టిన బిడ్డల పట్ల ఎవరూ ఎలాంటి బాధ్యతా వహించరు. ఆ కారణంగా ఆ పిల్లలు అనామకులుగానూ, సమాజంలో ఎలాంటి ఆదరణనూ పొందకుండా అనాథలుగానూ మిగిలిపోతారు. ఇదంతా నా దృష్టికి వచ్చింది. దాంతో నేను ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న ఈ మహిళలకు, అందులోనూ వృద్ధులైన బసివిలకు ఫించన్లు వచ్చేలా చేశాం. అంతే కాకుండా ఈ బసివి స్త్రీలకు ఉచితంగా గృహాలు నిర్మించి ఇచ్చే ఏర్పాట్లు మా ప్రభుత్వం ద్వారా చేశాం. అది ఈ నాడు నెరవేరబోతోంది. వీరికి ఓ గూడును ఏర్పాటు చేయడంతోపాటు వీరు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఓ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

ఈ సెంటర్‌లో వారికి బట్టలు కుట్టడం, చాకోపీసులు తయారుచేయడం, కొవ్వొత్తులు తయారు చేయడం, వజ్రాలకు నగిషీలు పెట్టడం మొదలైన పనులు నేర్పిస్తారు. ఈ స్త్రీల పిల్లలకు కూడా వీటిలో తర్ఫీదు ఇస్తారు. వస్తువులు తయారైన తరువాత ఈ సెంటర్ నిర్వాహకులే వాటిని అమ్మిపెడతారు. అలా వస్తువులు అమ్మగా వచ్చిన సొమ్మును వీళ్ళకే ఇస్తారు. ఆ విధంగా ఈ స్త్రీలు ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడగలిగేలా, తమ కుటుంబాన్ని తమ పిల్లల్ని పోషించుకునేలా శిక్షణ ఇస్తారు. తొందరలోనే ఈ దురాచారం పూర్తిగా అంతమైపోతుందని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. ఈ దురాచార బంధనాల నుండి ఈ స్త్రీలను మనమందరం రక్షిద్దాం" అంటూ మంత్రిగారు ఆవేశంగా తమ ఉపన్యాసం ముగించారు.

ప్రజల హర్షధ్వానాల మధ్య జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి "ఇప్పుడు మంత్రిగారు 'ఉచిత గృహాల'కు సంబంధించిన పట్టాలను బసివి మహిళలకు పంచిపెడతారు" అని అంటూ ఒక్కొక్కరినీ వేదిక మీదికి పిలిచి చప్పట్ల మధ్య మంత్రిగారి చేత పట్టాలు ఇప్పించారు. పట్టాల పంపిణీ కార్యక్రమం తరువాత అధికారి మళ్ళీ "ఇప్పుడు మంత్రిగారు ఈ గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు." అని అన్నారు.

అధికారగణం ముందుకు దారితీస్తుండగా మంత్రి కూడా నెమ్మదిగా కదిలి కాలనీ గేటు దగ్గరికి వచ్చారు. అక్కడ ఓ అమ్మాయి 'వెండి కత్తెర' ఉన్న ఓ పళ్ళేన్ని పట్టుకుని నుంచొని ఉంది.

ఆయన ఎంతో సహృదయంగా నవ్వుతూ 'వెండి కత్తెర' అందుకున్నారు. కాలనీ ప్రారంభోత్సవం కోసం స్తంభాలకు కట్టిన ఎర్ర రిబ్బన్‌ను ప్రజల కరతాళ ధ్వనుల మధ్య కత్తిరించారు.

మంత్రిగారు ముందుకు కదిలారు.

సమాజంలో అట్టడుగు వర్గాలో పుట్టి, అనాదిగా వస్తున్న దురాచారాల బంధనాల్లో చిక్కుకుని, కొందరు స్వార్థపరుల కుతంత్రాల కారణంగా బసివినులుగా మారి దుర్భర జీవితాలను వెళ్ళదీస్తున్నారు కొందరు మహిళలు. వారి పరిస్థితిని మన ప్రభుత్వం గుర్తించి ఆ దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దుచేసింది.

వారి వెంట మందీమార్బలమూ కదిలింది.

మంత్రిగారు కొత్తగా కట్టిన ఒక్కొక్క ఇంటినీ దాటుకుంటూ వృత్తి విద్యా కేంద్రం దగ్గరికి వచ్చారు. అక్కడ తమ వెంటే పళ్ళెం పట్టుకొచ్చిన అమ్మాయి నుంచి 'వెండి కత్తెర' అందుకుని ఆ కేంద్రం ముఖద్వారానికి కట్టిన రిబ్బనును కత్తిరించాడు.

కేంద్రం నిర్వాహకులు దారి చూపుతుండగా లోపలికి అడుగు పెట్టాడు. అక్కడ పదహారేళ్ళ నుండి యాభై ఏళ్ళ వయసు వరకు ఉన్న బసివి స్త్రీలు ఉన్నారు. మంత్రిగారిని చూడగానే వాళ్ళంతా భయభక్తులతో నమస్కరించారు. ఆయన హుందాగా తలూపుతూ ముందుకు కదిలారు. కేంద్ర నిర్వాహకులు కుట్టుపనుల గురించి, కొవ్వొత్తుల తయారీ గురించి వివరిస్తుండగా వింటున్న ఆ స్త్రీలను మంత్రిగారు గమనించాడు. నిర్వాహకులు వారందరినీ మంత్రిగారికి పరిచయంచేస్తూ వెండి కత్తెర పట్టుకుని తిరుగుతున్న అమ్మాయి అతి పిన్న వయస్కురాలైన బసివిగా పరిచయం చేశారు. మంత్రిగారు అందరితోనూ ఎంతో ఆదరంగా మాట్లాడారు.

అటు తరువాత...

అక్కడినుంచి బయలుదేరారు. తరువాత పి.ఎ వైపు కార్యక్రమం ఏమిటన్నట్టు చూశారు. మంత్రిగారి అభిప్రాయం అర్థమైనట్టు చిన్నగా నవ్వుతూ చేత్తో లోపలికి చూపాడు పి.ఎ. "మంత్రిగారు గెస్ట్‌హౌస్‌లో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. తర్వాత కొద్దిసేపు ప్రజల సమస్యలు వింటారు. తర్వాత ముఖ్యమైన స్థానిక నాయకులతో సమస్యల గురించి చర్చిస్తారు. ఇక ఆయనకు దారి వదలండి" అని అంటూ పి.ఎ కారు వైపు దారి తీశారు.

కారు నెమ్మదిగా గెస్ట్‌హౌస్‌వైపు కదిలింది. గెస్ట్‌హౌస్ చేరగానే కారు దిగిన మంత్రిగారిని అక్కడ ఉన్న జనాలు చుట్టుముట్టారు. ఏవేవో సమస్యలు ఏకరవు పెట్టారు. అర్జీలు ఇచ్చారు. అందరి సమస్యలూ తీరుస్తానని వాగ్దానం చేసి ఓ పెద్ద నమస్కారం పెట్టి లోపలికి దారి తీశాడు. పి.ఎ అక్కడ చేరిన జనాల్ని పంపేయాల్సిందిగా ఆదేశాలిచ్చి మంత్రిగారి వెంబడి పరుగులు పెట్టాడు. మంత్రిగారు గదిలోకి పోబోతూ పి.ఎ వైపు ఆలోచనగా చూశారు. ఆ చూపును అర్థం చేసుకున్నట్లు చిన్నగా నవ్వుతూ చేయి చాపి గదిలోకి దారి చూపాడు.

"ప్రారంభోత్సవమేనా?" కనుబొమ్మలు ముడేసి అడిగారాయన పి.ఎను అనుమానాస్పదంగా చూస్తూ.

"అమ్మమ్మా! ఎంత మాట!! ప్రారంభోత్సవమే...." పి.ఎ.

ఆయన గదిలోకి అడుగు పెట్టారు. ఆ వెనుకే తలుపులు మూసుకున్నాయి. గది మూలన ఓ అమ్మాయి నిలబడి వుంది. 'వెండి కత్తెర' ఉన్న పళ్ళెం పట్టుకుని ఆ అమ్మాయి బిత్తర చూపులతో నుంచుని ఉంది. మంత్రి నవ్వుతూ ఆమె వైపు అడుగేశాడు.

ఆయనతోపాటు ఆయన నీడ ఆమెను పూర్తిగా కప్పేసింది.

★

చూద్దామా

ఔరంగాబాద్ వెళ్దామా...

ముస్లింల దాడులకు చాలా పూర్వమే ఔరంగాబాద్ మంచి వాణిజ్య కూడలి. ఇప్పటికీ మహారాష్ట్రలోని మరాట్ ప్రాంతంలోని వ్యాపార కేంద్రం. దీని పూర్వనామం "ఖిడ్కి". అంటే కిటికీ అని అర్థం. దీని కథ చిత్రంగా వుంటుంది. ఏలగంగా తీరానవున్న ప్రతిష్ఠానపురం, ఆంధ్రమహా సామ్రాజ్యానికి శాతవాహనుల కాలంలో రాజధాని. ఇక్కడనుంచి ఉజ్జయిని వరకూ విస్తరించిన ఒకనాటి ప్రసిద్ధ వాణిజ్య రహదారిలో వున్న నగరం ఔరంగాబాద్. ఉత్తర భారతంవారు దక్కనుకు రావటానికి గూడా ఇదే మార్గం. వారి బసకు అన్ని వసతులతో నిర్మితమైన ఔరంగాబాద్‌ను, దక్కన్‌లోకి తొంగిచూసే కిటికీ అనేవారు. ఆనాటి ప్రతిష్ఠానపురం నుంచి పట్టువస్త్రాలు, అల్లికలు చెక్కతో మలచిన కళాకృతులు, గాజు పూసలు వంటి వాటిని, గ్రీసు, రోమ్, ఈజిప్టు దేశాలకు ఎగుమతి చేసేవారు. దీన్ని బట్టే, ఈ వాణిజ్య మార్గపు ప్రాముఖ్యత, ఆ దారిలోని వాణిజ్య కేంద్రం ఔరంగాబాద్ ఎంతటి వైభవంతో వుండేదో ఊహించుకోవచ్చు.

ఇది మొఘలు దక్షిణ రాజధానిగా అవతరించక పూర్వమే, ఔరంగజేబు (1659-1707 ఎ.డి) ఇక్కడకు రాజప్రతినిధిగా రాక పూర్వమే దీనికి ఆసక్తికరమైన చరిత్ర వుంది. మాలిక్ అంబర్ (1546-1626 ఎ.డి) అబిసీనియా నుంచి బానిసగా వచ్చి, స్వయం ప్రతిభతో చాంద్‌బీబీకి మంత్రిగా ఎదిగాడు. అంతేకాదు! అహమ్మద్ నగర పతనం తరువాత ఆ రాజవంశాన్ని నిలబెట్టి, ఆ వారసుని దౌలతాబాద్‌లో రాజుగా ప్రతిష్ఠించి తాను అమాత్య పదవిని చేపట్టాడు. దక్షిణాన మాలిక్ అంబర్ ఎంతటి వాడంటే ఈయనను ఉత్తరాదిన రాజా తోడర్‌మల్‌తో సరిపోల్చారు. ఆకాలంలో ఔరంగాబాద్ వైభవోపేతమైన నగరంగా వెలుగొందింది. మాలిక్ అంబర్ కుమారుడైన ఫతేఖాన్ పేరుమీద, ఔరంగాబాద్‌కు ఫతేనగర్ అని పేరు పెట్టారు. ఇలా రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఔన్నత్యాన్నందుకున్న కాలంలో ఇక్కడ రెండు లక్షల జనాభా వుండేది. ఆనాటికది చాలా గొప్ప విశేషమే. మాలిక్ అంబర్ కాలంలోనే ఇక్కడ నిర్మించిన అద్భుతమైన నీటి సరఫరా వ్యవస్థను మనం ఈనాటికీ చూడవచ్చు. ఇక్కడి 5 మైళ్ళ దూరంలోనున్న నది నుంచి, మట్టి గొట్టాల ద్వారా నీటిని మళ్లించి, ఇంత పెద్ద పట్టణానికి సమృద్ధిగా నీటి సరఫరా చేశారు. ఇది కేవలం భూమ్యాకర్షణ శక్తి ద్వారా ఏర్పాటు చేసిన వ్యవస్థ.

ఇలా సిరిసంపదలతో తులతూగుతున్న ఫతేనగర్ మీద మొఘలుల కన్నుపడింది. వారి సామ్రాజ్య విస్తరణ దక్షిణదిశగా సాగటానికి ఇది కీలకమైన నగరం. 1622లో షాజహాన్ ఫతేనగర్ మీద విరుచుకుపడి కొల్లగొట్టాడు. అంతకుమించి ఆక్రమించుకోవటానికి సాధ్యపడలేదు. మాలిక్ అంబర్ ప్రజ్ఞాపాటవాలు ఎంతటివంటే, ఈ విధ్వంసం నుంచి కొద్ది కాలానికే ఫతేనగర్‌కు పూర్వ వైభవాన్ని సంతరించి పెట్టాడు. ఈ మహాబుద్ధిశాలి, సాహసవంతుడు మాలిక్ అంబర్ 1626లో మరణించాడు. శతృవులు దీనికోసమే కాచుకుని వుంటారు గదా! 1633 నాటికల్లా నిజాంషాహి రాజ్యంతోపాటు, ఫతేనగర్ మొఘలుల వశమైనది. అప్పటినుంచీ దక్షిణ రాజధానిగా మొఘలుల రాజప్రతినిధి ఔరంగజేబు ఇక్కడకు మకాం మార్చాడు. ఇక దీని పేరు ఔరంగాబాద్‌గా మారిపోయింది.

ఔరంగజేబు తరువాత కథ వదలివేస్తే మహారాష్ట్ర ఆధ్యాత్మిక స్థాయికీ, ఆధ్యాత్మిక సాహిత్యానికీ ఉజ్వలస్థానాన్ని సమకూర్చి పెట్టిన భక్తాగ్రేసరులు, అవతార పురుషులు అయిన, జ్ఞానేశ్వర్, నామదేవ్, దాసోపంత్, రామదాసు, ఏకనాథ్‌వంటి ప్రముఖులు ఈ ప్రాంతంవారే. ఇంతటి చారిత్రక, ఆర్థిక ఆధ్యాత్మిక సంస్కృతికి పట్టుకొమ్మ ఔరంగాబాద్‌లోని విశేషాలను ఒకసారి పలికిద్దాము.

బీబీకా మఖ్‌బారా

దూరం నుంచి చూస్తే ఇది ఆగ్రాలోని తాజ్‌మహల్‌కు ప్రతికృతిగా అనిపిస్తుంది. ఔరంగజేబు భార్య దిల్‌రాన్ భానూ బేగం సమాధి ఇది. ఈమెను రబియా దురానీ అని కూడా వ్యవహరించేవారు. 1660లో దీని నిర్మాణానికి అవసరమైన పాలరాతిని జైపూర్ నుంచి 16 ఎడ్లను పూన్చిన బళ్లలో ఇన్ని వందల మైళ్ళ తేవటం ఆనాటి రాజరికానికే చెల్లింది. దీని నిర్మాణానికి ఆ రోజుల్లోనే 7 కోట్ల రూపాయలు ఖర్చయిందట. వీటన్నిటికంటే ఔరంగజేబు వంటి చక్రవర్తి ఇంతటి ఖర్చుతో నిర్మాణం చేపట్టటమే గొప్ప వింత. విస్తారమైన ఈ కట్టడం 1500 అడుగుల పొడవు, 900 అడుగుల వెడల్పుతో చుట్టూవున్న ఆర్చీల మధ్య పైకెగసిన మినార్లతో అందాలు విరబూసినట్లుంటుంది. మనం దక్షిణదిశగా ఈ ప్రాంగణంలోకి ప్రవేశించగానే, దీర్ఘచతురస్రాకార కొలనులు, వాటిలో ఫౌంటెన్లు, చుట్టూ పరచుకున్న పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. లోపల కట్టడం సమాధి మందిరం 72 అడుగుల



బీబీకా మఖ్‌బారా



ఔరంగాబాద్ గుహలు



పంచక్కి

చదరంగా వుంటుంది. దీనికి నాలుగు మూలలావున్న మినారెట్లు కూడా 72 అడుగుల ఎత్తున్నాయి. సమాధి వరకూ పాలరాతి నిర్మాణం. మిగిలినది సున్నపు మిశ్రమంతో నిర్మించారు. సమాధిచుట్టూ పాలరాతితో మలచిన తెరలు అష్టభుజాకారంలో వున్నాయి. ఈ సుందర నిర్మాణం ఔరంగజేబు తండ్రి షాజహాన్ తన భార్య నూర్జహాన్‌కు నిర్మించిన తాజ్‌మహల్‌కు నమూనా మాత్రమే. కాని తాజ్‌మహల్‌కే దక్కిన విశిష్టమైన సమతూకం అక్కడ ప్రతిరాతిలోనూ మలచిన రంగురంగుల తాపడాలలో నిక్షిప్తం చేసిన కళావైభవం ఇక్కడ కానరావు. తాజ్‌మహల్ ఒక అపూర్వ సృష్టి. దానికి సాటివచ్చేదేదీ లేదు.

పంచక్కి

ఇక్కడున్న ధాన్యపు మిల్లు వలన దీనికీ పేరు వచ్చింది. సమీపంలోనున్న ఖామ్ నది నుంచి, మట్టి గొట్టాల ద్వారా నీరు ఇక్కడకు చేర్చి ఆ జలశక్తితో ఈ మిల్లు నడిపించేవారు. ఇది 1624 నాటి నిర్మాణం. ఆనాటికే ఇంతటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి తేవటం గొప్ప విశేషమే. ఈ విధంగా నూర్చిన గోధుమలతో ఇక్కడ పేదలకు అన్నదానం జరిగేది. దీనికొక కారణముంది. ఇక్కడ బాబాషా ముసాఫిర్ అనే ముస్లిం మహాత్ముని సమాధి వుంది. ఈ సూఫీ మహాత్ముడు ఔరంగజేబుకు గురుతుల్యుడు. ఇక్కడున్న కట్టడాలలో ఈ మహాత్ముని సమాధే ముఖ్యమైనది.

నదిలో పారే నీటిని మట్టి గొట్టాలతో, నీటి కొరకు నిర్మించిన గోడమీదకు తీసుకువచ్చి ఇక్కడ అంత ఎత్తు నుంచి కిందికి వదలి చిన్న జలపాతాన్ని సృష్టించిన తీరు విస్మయకరం. ఇక్కడ చాలా జలపాతాలున్నాయి. ఇవన్నీ ఈ నీటితోనే నిండుతున్నాయి. సమాధి చుట్టూ వున్న అందమైన గార్డెన్... దీనిలో నీరు చిమ్ముతున్న ఫౌంటెన్లూ... తటాకాల అమరిక... చుట్టూ పరచుకున్న ప్రకృతి అందాలు.... చిన్న చిన్న జలధారలు ఒక అహ్లాదకరమైన సమ్మేళనం. ఒక తటాకం కింద పెద్ద హాలు నిర్మించారు. ఇదొక వింత. మొదట ఇది ధాన్యపు మిల్లు మాత్రమే కాదు. ఒక మహాత్ముని సమాధి. దానిని దర్శించడానికి వచ్చే భక్తులకూ, పేదలకూ నిత్యాన్నదానమూ, నీటి సౌకర్యమూ, ప్రశాంతతతో పాటు మనస్సును పరశింపజేయటానికి అందులో తటాకాలు, ఉద్యానవనాలు, జలధారలూ... చూడముచ్చటగా వుంటాయి.

ఔరంగాబాద్ గుహలు

బీబీకా మక్బారాకు దాదాపు 2 మైళ్లదూరంలో వున్న ఈ గుహలకు వెళ్లటానికి సరైన సదుపాయం లేదు. కచ్చారోడ్డు కొండలు ఎక్కటం దిగటం చాలా ప్రయాసతో కూడుకున్నది. ఇవి మొత్తం 12 గుహలు, మూడు సముదాయాలుగా వున్నాయి. ఒక్కొక్క సముదాయానికి మధ్య ఒక మైలు నడవాలి. వాహనం పోదు. వీటి నిర్మాణం 2వ శతాబ్దంలో ప్రారంభమై 6వ శతాబ్దం వరకూ సాగింది. ఇవన్నీ బౌద్ధ గుహలే. వీటిలో ఒకటి చైత్యము. మిగిలినవన్నీ విహారాలు. కొన్ని అజంతా గుహలను పోలివుంటాయి. కానీ ఆ ఉదాత్త సమతూకం ఇక్కడ కానరాదు. వీటిని పరిశీలిద్దాం.

1వ గుహ

ఇది విహారము. 76 అడుగుల వెడల్పున్న విశాలమైన వరండా రాతి స్థంభాలమీద (అదే కొండలోనుంచి మలచినవి) నిలచి, స్థంభానికి పైభాగాన సీలింగ్‌కు బ్రాకెట్లుగా అప్సరసల మూర్తులున్నాయి. పశ్చిమంగా బుద్ధుడు పద్మాసనాసీనుడై వుండగా నాగదేవతలు తమ పడగలు విప్పి వాటిపై ఆ పద్మాసనాన్ని మోస్తున్నట్లు మలచారు. వరండా బయట, ఎడమ పక్కన కూర్చునివున్న భంగిమలో బుద్ధ విగ్రహాలను వరుసగా మలచారు.

2వ గుహ

ఇది చైత్యము (ప్రార్థనామందిరం). ఇక్కడ చాలా పెద్ద బుద్ధ విగ్రహం పద్మాసనం మీద మలచారు. చేతులు ప్రవచన ముద్రలో వున్నాయి. భుజాలపైన దేవతలను మలచారు.

3 గుహ

ఇక్కడ వరండా 12 స్థంభాలమీద నిలచి, ఈ స్థంభాలన్నీ శిల్పకళా విన్యాసంతో అజంతా గుహలను జ్ఞప్తికి తెస్తాయి. ఇక్కడ చాలా పెద్ద బుద్ధవిగ్రహం సుఖాసనంలో మలచారు. ఎంతోమంది భక్తుల శిల్పాలు, స్త్రీలు, పురుషులు రెండు వరుసలలో మలచారు. వీటిలో స్త్రీలకున్న శిరోజాలంకరణ, వారి రూపమాధుర్యం అద్భుతంగా వుంటుంది. ఇక్కడ మూడు పక్కలా భిక్షువుల నివాసానికీ, ధ్యానానికీ గదులు మలచారు. ఈ గుహ 82 అడుగుల పొడవు 63 అడుగుల వెడల్పుతో విశాలంగా వుంటుంది. ఇక్కడున్న గుహలన్నింటిలోకి చూడదగ్గదీ గుహ. దీని నిర్మాణ, శిల్పసౌందర్యం మనోహరంగా వుంటాయి.

6 గుహ

ఇది చైత్యము, విహారమూ కలసినట్లుంది. మధ్యలో చాలా పెద్ద బుద్ధ విగ్రహం మూడువైపులా భిక్షువుల గదులు. వీటిలో రాతితో మలచిన అరుగులే వీరి పడకలు.

7వ గుహ

ఇది ఇక్కడ హాలు వెనుకగా 6 గదులు భిక్షువుల నివాసం కోసం మలచారు. ఇక్కడ బోధిసత్వ పద్మపాణి విగ్రహం. దీనికి ఇరుపక్కలానున్న విగ్రహాలు, బౌద్ధుల ప్రార్థనా సరళిని, వివిధ ఆంగిక భంగిమలతో సూచిస్తున్నాయి. ఉదాహరణకు తమను అగ్ని శత్రువు, బానిసత్వం, జలగండం వంటి ప్రమాదాల నుంచి కాపాడమనీ, అలాగే సింహము, ఏనుగు సర్పములు, రాక్షసుల పీడల నుంచి రక్షించమని వేడుకుంటున్నట్లు ఒక్కో శిల్పంలో ఒక్కో విజ్ఞాపనను మలచారు. ఇది గుహలో కనిపించే ప్రత్యేక ఆంగిక విన్యాసం విశేషం. మరోపక్క భోధిసత్వ వజ్రపాణిని మలచారు. ఈయనకు కుడిపక్క విద్యాధిదేవత సరస్వతి, పైభాగంలో గంధర్వులు, అప్సరసలనూ మలచారు. ఈ క్రమం చూస్తే, ఈ గుహ నిర్మాణకాలానికే బౌద్ధం తన కఠోర నియమాలను సడలించుకుని, సనాతన ధర్మఛాయలు సంతరించుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఏదేమైనా ఇది అన్ని గుహలకంటే నిర్మాణ శైలిలోనూ, శిల్ప సంపదలోనూ విశిష్టమైనది, తప్పక చూడవలసింది.

ఇవిగాక మిగిలిన గుహలలో చూడదగ్గవేమీ లేవు. అన్నీ శిథిలాల గుట్టలే.

★



ఆహారం లేనిదే జీవం లేదు. కానీ తగినంత ఆహారం లేకుండా ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారు. నాగరిక సమాజంలో మానవులు తమకు అవసరమైన ఆహారాన్ని సంపాదించుకునే వీలుకూడా లేని ప్రదేశాలు ఇంకా ఉండడం మన అభివృద్ధికి అవమానం. అసలు అభివృద్ధి అన్న విషయమే అనుమానం.

అందరికీ అందని ఆహారం

- డా॥ కాకర్లమూడి విజయ్

ప్రకృతితో సహజీవనం చేస్తున్నప్పుడు సమస్యలు తరచూ అనూహ్యంగా వస్తుంటాయి. అటువంటి సందర్భాలలో కూడా ఆహారం లభించడం ముఖ్యం. ఆ దిశలో 'పాలకుల' ధ్యాస ఉండాలి. ప్రణాళికలు తయారవ్వాలి. ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఈ కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నట్టనిపిస్తున్నా ఎక్కడో ఏదో లోపం ఉందనిపిస్తుంది. అందుకు నిదర్శనమే ఈ నాటికీ అన్నం లేక విలవిల్లాడుతున్న దేశాలు. కారణం కరువు కావచ్చు. వరద కావచ్చు. ఆర్థికంగా వెనుకబాటుతనమూ కావచ్చు. ఫలితం మాత్రం మానవబాధ.

ప్రపంచ ఆహార దినోత్సవం

ఈ విషయాన్ని ఏడాదికోసారి గుర్తు చేయడానికన్నట్టు యునైటెడ్ నేషన్స్ ప్రతి అక్టోబరు 16వ తేదీని ప్రపంచ ఆహారదినంగా పరిగణిస్తోంది. ముప్ఫైఏళ్ల క్రితం 1979 నవంబరులో ఈ ప్రతిపాదన చేశారు. అప్పటి నుండి ప్రతి ఏటా 150 కంటే ఎక్కువ దేశాలలో ఆహారదినం పాటిస్తున్నారు.

ప్రపంచంలో ప్రతి మనిషీ ధనికుడు కాకపోయినా, కనీసం ఏరోజూ ఆహారం లేక అలమటించకూడదన్నది ఆలోచన. లెక్కలు చూస్తే అంతా బాగానే ఉన్నట్టనిపిస్తుంది. తలసరి ఆహారం ఎక్కువై లావైనవాళ్ల సంఖ్య, ఆహారలోపం బారిన పడ్డవాళ్ల సంఖ్యకంటే ఎక్కువుంది. కానీ ప్రపంచవ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు.

ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గుచూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటులోకి లేనంతగా పెరగడం మరో సమస్య.

ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. ఆహార సరఫరాలో ఏమాత్రం తగ్గింపు కనిపించినా అది అతితక్కువ సమయంలో ఈ 'అర్బన్' జనాభాపై బహుళప్రభావం కనబరుస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహారలోపం 35 శాతం దాటిందని తేలింది.

ఈ మధ్య దివంగతుడైన (సెప్టెంబరు 12, 2009) వ్యవసాయ పరిశోధకుడు, నోబెల్ బహుమతి గ్రహీత నార్మన్ బోర్లాగ్ హరిత విప్లవానికి మూలపురుషుడు. మనదేశపు రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ కూడా పొందిన బోర్లాగ్ ప్రపంచ ఆహార సమస్యపైనే పరిశోధించాడు. ఆయన కారణంగా కోట్ల జనాభా ప్రాణాలు నిలబెట్టుకుంది. ఆయన సూచించిన పద్ధతుల వల్ల ఆసియా, ఆఫ్రికా దేశాలలో ఆహారోత్పత్తి అధికమైంది.

సంప్రదాయేతర ఆహారం

కానీ రాబోయే కాలంలో ఆహారోత్పత్తి కంటే జనాభా పెరిగిపోయే ప్రమాదముంది. మారుతున్న వాతావరణ, సామాజిక, ఆర్థిక సమతుల్యతల వల్ల అనూహ్యరీతిలో ఆహార సమస్య ఎదురయ్యే ప్రమాదముందని నిపుణులు అంటున్నారు.

ఆ దిశలో సంప్రదాయేతర ఆహారాన్ని అలవాటు చేసుకోవలసిన అవసరం గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. సముద్రాలలోని ఆల్గే నుండి పౌష్టికాహారం తయారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 'స్పిరులీనా' అనేది రూపొందింది. కానీ ప్రజలందరూ తినగలిగినంత మోతాదులోనూ, ఇష్టపడే రుచిలోనూ ఇంకా రావలసిఉంది. మాంసకృత్తుల నిధిగా ప్రచారం చేసిన సోయాచిక్కుళ్లు అనుకున్నంత ప్రాచుర్యం పొందలేదు. బోర్లాగ్ రూపొందించిన అధిక దిగుబడి గోధుమ, వరి అధికంగా తినే వారికి ఉపయోగపడలేదు. వరిపొలాలు చేపల చెరువులయ్యాయి. ఉన్న పొలాలు నీరు లేక కొంతా, నీరు ఎక్కువై కొంతా నష్టపోతున్నాయి. లాభాలు కనిపించక రైతులు వ్యవసాయం మానుతున్నారు. ఇటు జనాభా ఏమాత్రమూ తగ్గే దిశలో లేదు. ఆహార సమస్య (డబ్బున్న వాళ్లకి లేకపోతే పోవుగాక) మాత్రం తీవ్రమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

ఆహారంలో అంతగా ఉపయోగపడని టమాటాలూ, ఉల్లిపాయలూ ధరలు పెరిగితే వాటిని మానేయలేనంతగా అలవాటుపడ్డ మనం నిజంగా ఆహార సమస్య వస్తే తట్టుకోగలమా? ★

ఎంత లావు పిల్లాడో...

హలో...ముద్దులొలుకుతున్న ఈ పసోడు పుట్టినప్పుడు ఎంత బరువున్నాడో తెల్సా! సింపుల్‌గా 8.7 కేజీలే. పొడవు 62 సెంటీమీటర్లే. పేరు అక్బర్ దిగ్రేట్. అదీ ఒక సుగర్ పేషెంటుకి ఇంత బరువున్న పిల్లాడు పుట్టడం మామూలు విషయం కాదుకదా. ఇంత బొద్దుగా ముద్దుగా వున్న పిల్లాడ్ని చూడడం తన సర్వీస్‌లో ఇదే మొదటిసారని ఈ పిడుగు పుట్టిన ఆసుపత్రిలో ఓ డాక్టర్‌గారు చెప్తున్నారు. బొద్దు బుడుగును చూడ్డానికి స్థానిక జనాలు తండోపతండాలుగా వచ్చేస్తున్నారు. తోటి చిన్నారులకంటే మాంచి స్పీడుగా పాలు తాగేస్తున్నాడు. అని (41), హాసనుద్దీన్ (50) దంపతులకు వీడు మూడవ సంతానం. మొదటి బిడ్డ పుట్టినప్పుడు 5.3 కేజీల బరువుండగా, రెండవ వాడు 4.5 కేజీల బరువున్నాడు. ఇండొనేషియాలో పుట్టిన పిల్లల్లోకెల్లా బరువాటి పిల్లోడు వీడేనంట. 2007లో జకార్తాలో 6.7 కేజీల బరువాటి బుడ్డోడు పుట్టాడు. అంటే ఆ రికార్డును అక్బర్ ది గ్రేట్ బద్దలు కొట్టినట్టేగా.

మిస్టర్ కేశవ్

ఈ ఫొటోలోని వ్యక్తిని చూస్తే ఆదిమ మానవుడు గుర్తొస్తున్నాడు కదా! అవును మరి అలా ఒంటి నిండా వెంట్రుకలుంటే ఆదిమ మానవుడు కాక ఇంకెవరు గుర్తుకొస్తారు అంటారా? ఇతగాడి పేరు యు జెన్‌హాన్. వయసు 26. చైనావాసి. ఈయన ఒంటి మీద 96 శాతం వరకూ వెంట్రుకలు ఉన్నాయి. పైగా శరీరంమీద ప్రతి 0.16 స్క్వేర్‌మీటరుకూ 41 వెంట్రుకలు ఉన్నాయి. అరికాళ్లు, అరిచేతులు తప్ప శరీరమంతటా ప్రతి అంగుళంలోనూ వెంట్రుకలు కనిపిస్తాయి. ఇవి అతని వినికిడి శక్తిని దెబ్బతీస్తున్నాయి. అందువల్ల ఈ మధ్యనే వెంట్రుకలను తొలగించేందుకు ఆపరేషన్ చేశారు. పొడవాటి కనుబొమలు అతని కంటినీ కప్పేస్తున్నాయి. ముక్కుమీది వెంట్రుకలను, పళ్లను కప్పివేస్తున్న చిగురును తొలగించడానికి ఆయనకు ఐదు ఆపరేషన్లు చేశారు. ఇది అనువంశిక వ్యాధని వైద్యులు చెప్తున్నారు. ఇవేనా! బాల్యంలో అతను చాలా కష్టాలు పడ్డాడు. ప్రతి ఒక్కరూ వేలెత్తి చూపేవారు. నవ్వేవారు. ఆదిమమానవుడనేవారు. అయితేనేం మనవాడు మాత్రం ఊరుకునేవాడు కాదు. వారితో పోట్లాడి రాళ్లు విసిరేవాడు.అంతేకాదండోయ్! తనకు ఆరు సంవత్సరాల వయసున్నప్పుడు 'ఎ హెయిరీ చైల్డ్స్ అడ్వెంచర్' అనే సినిమాలో నటించాడు. ప్రస్తుతం ఈ వెంట్రుకల వల్ల అతను ఆరోగ్యపరమైన సమస్యలు కూడా ఎదుర్కొంటున్నాడు. చెవుల కింద అనవసరమైన చెత్త పేరుకుపోయినందువల్ల మెదడూ దెబ్బతినే ప్రమాదముందని వైద్యులు అంటున్నారు. అయితే మిస్టర్ కేశవ్ పబ్బుల్లోనూ, బార్లలోనూ పాడుతుంటాడు. అన్నట్టు ఆ విధంగానే ఆయనకు ఒక గర్ల్‌ఫ్రెండ్ కూడా పరిచయమైంది. ఇక పాటలు రాయడం కూడా మొదలు పెడతాడట. ఈ సంవత్సరం చివరలో ఒక ఆల్బమ్‌నూ చేయాలని అనుకుంటున్నాడు.



మోసకారి

-కె.సాహిల్



అదో పెద్ద సరస్సు. అందులో బోలెడన్ని కప్పలు నివశిస్తుండేవి. అయితే ఓ పేద్ద సర్పం కూడా అక్కడే జీవిస్తుండేది. కాకపోతే వయసు పైబడడంతో ఆహారం సంపాదించుకోవడమే కష్టంగా తయారౌతుంది. దాంతో అది తన తెలివంతా ఉపయోగించి ఒక ఉపాయం ఆలోచిస్తుంది. అమాయకంగా కళ్లు ఆర్పుకుంటూ కప్పల నివాసం దగ్గరకెళ్తుంది. దీన్ని చూచి కప్పలన్నీ భయపడిపోయి పెద్ద బండరాయి కిందకు వెళ్లిపోతాయి. అయితే కప్పల రాజు మాత్రం ధైర్యంగా ఒక గట్టు మీద నిలబడి ...

"ఏంటి! ఇక్కడకు వచ్చావు? మీ జాతి ఎలాంటిదో ప్రపంచ జనులందరికీ తెల్సు. మర్యాదగా ఇక్కడి నుంచి వెళ్లిపో. అదే మనందరికీ మంచిది" అంటుంది.

దానికి వృద్ధ సర్పం ఏమాత్రం బాధపడకుండా... "ఏం చేద్దాం? మా జాతిని చూస్తే ఎవరైనా అలాగే మాట్లాడతారు. పైగా మీకు మాకు జాతి వైరం వుంది. నీ మాటల్లో ఏమాత్రం తప్పు లేదు. కాకపోతే నేను ఒక విషయం చెప్పడానికి వచ్చాను. మీరెవరూ నన్ను చూసి భయపడకండి. నేను మిమ్మల్ని ఏమీ చేయను. నన్ను నమ్మండి. నేను ఇప్పటికే ఒక పెద్ద పాపం చేశాను. దాన్నుంచి ఎలా బయటపడాలో అర్థంకాక తల బద్దలు కొట్టుకుంటున్నాను. ఇంకా మిమ్మల్ని చంపి తిని మరింత పెద్ద పాపం చేయలేను...." అంటుండగానే మరో కప్ప ఇలా అంటుంది.

"పాపమా! ఏంటది?"

"నేను ఒక బ్రాహ్మణ పిల్లవాడిని కరిచాను. వాడు చనిపోయాడు. దానికి అతని తండ్రి నన్ను శపించాడు"

"శాపమా! ఏంటది?"

"మరేంలేదు. నీ శాపం పోవాలంటే నీ వీపు మీద కప్పలను మోయాలి. వాటికి ఎలాంటి హాని తలపెట్టకూడదన్నాడు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. మీరు కనుక అవకాశం ఇస్తే మిమ్మల్ని ఎక్కడికి కావాలంటే అక్కడికి నా వీపు మీద తీసుకెళ్లి దింపుతాను. ఇన్నాళ్లుగా నా శాప విముక్తి పొందే అవకాశమే రాలేదు. మీరైనా కనికరించండి" అంటుంది.

కప్పల రాజు ఇదంతా విని జాలి పడి...

"ఓ...నీ కథ వింటుంటే నా మనసు ద్రవించిపోతోంది. నేను నీకు తప్పకుండా సాయం చేస్తాను. నువ్వు కోరుకున్నట్టే మాకు సేవ చేసుకునే అవకాశం కల్పిస్తాను. ఇక నుంచి మా కప్పలు ఎక్కడికి వెళ్లాలన్నా నీ సాయం తీసుకుంటాయి. అందుకు నువ్వు సిద్ధమేకదా" అంటాడు.

దానికి పాము సంతోషంగా తల ఊపుతుంది. అంతలోనే నీరసంగా పడిపోతుంది. దానికి కప్పల రాజు కంగారుగా

"ఏమిటి మిత్రమా! ఏమైంది?" అనడుగుతాడు.

"ఏమీ లేదు రాజా! మనో వ్యధతో గత కొద్ది రోజులుగా ఆహారం ఏమీ తీసుకోవడం లేదు. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా వుంది. ఏదైనా ఆహారం తీసుకుంటాను"

"ఓ...ఆహారం తీసుకోకుండా ఎలా నేస్తమా! వెళ్లు ఆ మూలకు వెళ్లి చిన్నాచితకా పాములను తినిరా!" అంటుంది.

పాము ఎంతో వేగంగా అక్కడకు వెళ్లి బాగా కండపట్టిన కప్పలను తిని నాలుకతో మూతి తుడుచుకుంటూ వస్తుంది.

తర్వాత కప్పల రాజు తన మంత్రులను పాము వీపు మీద ఎక్కి కూర్చుని సరస్సు అంతా చూచి రమ్మంటాడు సరదాగా.

కప్పల మంత్రులు రాజాజ్ఞను పాటిస్తాయి. హాయిగా వినోదంగా సరస్సంతా చూసి వస్తాయి. అలా ప్రతి రోజూ ఇతర కప్పలను కూడా తన వీపు మీదకెక్కించుకుని వాటికి ఆహ్లాదాన్ని పంచి ఇస్తుంటుంది పాము. పనిలో పనిగా కప్పలను కూడా తింటూనే వుంటుంది. కొద్ది రోజులకే సరస్సులో కప్పల సంఖ్య తగ్గిపోతుంది. కప్పల రాజుకు తమ జనాభా తగ్గిపోవడం తెలుస్తుంది. కారణం తెల్సుకోవడానికి నిఘా ఏర్పాటు చేస్తుంది. వృద్ధ సర్పం తన మొసలి కన్నీళ్లతో మోసం చేసిందని తెల్సుకుంటుంది. రాజుగా కప్పలను కాపాడాల్సిన బాధ్యత తనదే కాబట్టి పాము అసలు రంగు బయటపెట్టి

"దుష్టుడికి దూరంగా వుండాలని పెద్దలు ఊరకే చెప్పలేదు. మనం దాన్ని మరిచాం. అందుకే అంతకు అంతా నష్టాన్ని చవిచూశాం. మనవారినెందరినో కోల్పోయాం. ఇకనైనా ఆ దరిద్రపు పాముకు దూరంగా వుందాం. దాన్ని ఈ సరస్సు ఛాయలకు కూడా రావద్దని చెప్దాం" అంటుంది.

దానికి కప్పలన్నీ సరేనన్నట్టు తలూపుతాయి.